వినాయక విగ్రహం వద్ద దుకాణాల ఏర్పాటుపై రగడ

- అనుమతి నిరాకరించిన దేవదాయ శాఖ
- అధికారులు, నిర్వాహకుల మధ్య వివాదం.. పోలీసుల జోక్యం

- వార్త 6వ పేజీలో..

ఉద్యోగం.. ఉత్సాహం

డీఎస్సీ మెరిట్ జాబితాలు విడుదల

- ఫలించిన నిరీక్షణ
- ఏడేళ్ల తరువాత ఉపాధ్యాయ పోస్టుల భర్తీ
- నేడో, రేపో సెలక్షన్ జాబితా
- ఉమ్మడి జిల్లాలో 1,139 ఖాళీలు
- ఉక్కునగరంలోని విమల విద్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన
- ఎంఈవోలు, హెచ్‌ఎంలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ
- వేర్వేరు యాజమాన్యాల ఆధ్వర్యంలో పోస్టింగ్, కౌన్సెలింగ్



విశాఖపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):
ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి నిర్వహించిన డీఎస్సీ రాత పరీక్షా ఫలితాల వెల్లడి కావడంతో అభ్యర్థుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. డీఎస్సీ కోసం ఏడేళ్లుగా అభ్యర్థులు నిరీక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం గత ఏడాది నోటిఫికేషన్ జారీచేసింది. దీనికి సంబంధించి ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన రాతపరీక్ష ఫలితాలు శుక్రవారం రాత్రి ప్రకటించింది. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, మునిసిపల్, గిరిజన సంక్షేమ, జువెనైల్ శాఖల పరిధిలో 1,139 పోస్టుల భర్తీకి సంబంధించి సబ్జెక్టుల వారీగా మెరిట్ లిస్టులు విడుదల చేసింది. వీటితోపాటు జోనల్ స్థాయిలో చేపట్టనున్న బీసీ, ఎస్సీ గురుకులాలు, మోడల్ స్కూళ్లలో టీజీటీ, పీజీటీ పోస్టులు, ప్రిన్సిపాళ్ల నియామకాల్లో ఉమ్మడి జిల్లాలో పలువురికి అవకాశం దక్కనున్నది.

ఉమ్మడి జిల్లాలో ఒకేసారి 1,139 మందికి ఉద్యోగాలు వస్తుండడంతో అభ్యర్థులు, వారి కుటుంబాల్లో ఆనందం వ్యక్తమవుతుంది. చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్న సమయంలో 2018లో డీఎస్సీ నిర్వహించారని, ఆ తరువాత మళ్లీ ఇప్పుడు ఆయన హయాంలోనే పోస్టులు భర్తీ చేస్తున్నారని అభ్యర్థులు గుర్తుచేస్తున్నారు. ఒకేసారి పలు యాజమాన్యాల పరిధిలో ఖాళీలు భర్తీచేయడం చాలావరకు ఉపయోగపడిందని పలువురు వ్యాఖ్యానించారు. శుక్రవారం రాత్రి విడుదల చేసిన మెరిట్ జాబితాలో అభ్యర్థులకు వచ్చిన మార్కుల ప్రకారం ర్యాంకులు ప్రకటించారు. దాని ప్రాతిపదికగా రోస్టర్ పాయింట్లు ఉపయోగించి సెలక్షన్ జాబితా సిద్ధం చేస్తున్నారు. రోస్టర్ ఆధారంగా కటాఫ్ మార్కులు నిర్ణయించి ఆదివారం లేదా సోమవారం సెలక్షన్ జాబితా విడుదల చేయనున్నారు. సెలక్షన్ జాబితా మేరకు అభ్యర్థులకు కాల్ లెటర్స్ పంపించనున్నారు. కాల్ లెటర్ వచ్చిన అభ్యర్థులు మాత్రమే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాల్సి ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో జడ్పీ, మునిసిపల్, ప్రభుత్వ పాఠశాలలు, గిరిజన సంక్షేమ శాఖ, జువెనైల్ శాఖలలో పోస్టుల భర్తీ, జోన్ పరిధిలో గురుకులాల్లో టీజీటీ, పీజీటీ, ప్రిన్సిపాళ్ల నియామకాల కోసం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన విద్యా శాఖ పరిధిలో జరగనున్నది. విశాఖ ఉక్కు నగరంలోని విమల విద్యాలయంలో ... మిగతా 6వ పేజీలో

చదువుల తల్లి



సీహెచ్ శ్రీదేవి

అచ్యుతాపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొప్పెర్ల శివారు కొత్తగరువుకి చెందిన సీహెచ్ శ్రీదేవి ఎస్‌జీటీలో ఉమ్మడి విశాఖ జిల్లాలో మూడవ ర్యాంకు సాధించింది. ఆమె భర్త చిరుద్యోగి. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నా పట్టుదలతో చదివి ఉత్తమ ర్యాంకు సాధించింది.

విద్యా కుసుమం జ్యోత్స్న

- స్కూల్ అసిస్టెంట్ హిందీ కేటగిరీలో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఫస్ట్ ర్యాంకు
- రాష్ట్ర స్థాయిలో మూడవ ర్యాంకు



చోడవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):
డీఎస్సీ ఫలితాల్లో పట్టణానికి చెందిన కురచా జ్యోత్స్న సత్తాచాటింది. స్థానిక శివాలయం వీధిలోని సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన జ్యోత్స్న స్కూల్ అసిస్టెంట్ హిందీ కేటగిరీలో 86.05 మార్కులతో ఉమ్మడి విశాఖ జిల్లా మొదటి ర్యాంకుతో పాటు రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానం సాధించింది. ఇక టీజీటీ విభాగంలో 88.05 మార్కులతో జోన్-1లో ప్రథమ స్థానంతో పాటు రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకు సాధించింది. సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన నారాయణమూర్తి, వెంకటలక్ష్మి దంపతుల రెండవ కుమార్తె జ్యోత్స్న. స్థానికంగానే స్కూళ్లలో విద్యాభ్యాసం పూర్తిచేసిన ఆమె హిందీ ఉపాధ్యాయురాలు ఎంవీ లక్ష్మి ప్రోత్సాహంతో హిందీ పండిట్ కోర్సు పూర్తిచేసి ఏడాదిగా డీఎస్సీ కోసం సాధన చేసి విజయం సాధించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హిందీ ఉపాధ్యాయినిని కావాలన్నదే తన కోరిక అని చెప్పింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో లక్ష్యాన్ని సాధించగలిగానని తెలిపింది.

గణితంలో టాపర్

సత్తా చాటిన సుంకరణం విజయ్



ఎస్.రాయవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట నియోజకవర్గం ఎస్.రాయవరం మండలం వమ్మవరం అగ్రహారం గ్రామానికి చెందిన సుంకరణం విజయ్ ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ) గణితంలో 87.33, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ) గణితంలో 78.5, స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ) గణితంలో 94.67 మార్కులు సాధించి రాష్ట్ర టాపర్‌గా నిలిచారు. తండ్రి నాగార్జున శర్మ ఫొటోగ్రాఫర్ కాగా, తల్లి వెంకటలక్ష్మి గృహిణి. విజయ్‌కి చిన్నతనం నుంచి టీచర్ కావాలనే కోరిక ఉండేది. పదవ తరగతి చదువుతున్నప్పటి నుంచే గ్రామంలో ట్యూషన్ చెబుతూ కుటుంబానికి చేయూతగా నిలిచేవాడు. ఎంతో కష్టపడి చదివి డీఎస్సీలో ప్రథమ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ లక్ష్య సాధన కోసం రోజుకు 10 నుంచి 12 గంటల పాటు చదివేవాడినని తెలిపాడు. రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించడం వలన తన కల నెరవేరిందన్నాడు. తాను స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించాలని అనుకుంటున్నట్టు తెలిపాడు.

డీఎస్సీలో సత్తా చాటారు - 6లో

ఉపాధి పాత బిల్లులు విడుదల

వైసీపీ హయాంలో నిలిపి వేసిన బకాయిలకు మోక్షం

- జిల్లాకు రూ.8.2 కోట్లు కేటాయించిన ప్రభుత్వం



బుచ్చెయ్యపేటలో గతంలో పనులు పూర్తి చేసినా బిల్లు అందని సిమెంట్ రోడ్డు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)
ఉపాధి హామీ పథకం కింద పనులు చేసి బిల్లుల కోసం ఎదురు చూస్తున్న కాంట్రాక్టర్లకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో చేసిన పనుల బిల్లులను వైసీపీ అధికారంలోకి వచ్చాక నిలిపివేసింది. కొందరు కాంట్రాక్టర్లు కోర్టును ఆశ్రయించగా, మరికొందరు అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయారు. తాజాగా కూటమి ప్రభుత్వం వీరి బకాయిలు చెల్లించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో సుమారు రూ.15 కోట్ల విలువైన రహదారుల నిర్మాణ పనులను కాంట్రాక్టర్లు చేశారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ఈ పనులకు వైసీపీ అధికారంలోకి వచ్చాక బిల్లుల చెల్లింపులు సక్రమంగా జరపలేదు. దీంతో కాంట్రాక్టర్లు బిల్లులు అందక, చేసిన అప్పులకు వడ్డీలు కట్టుకోలేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొంతమంది హైకోర్టును ఆశ్రయించడంతో 20 శాతం మినహాయించుకొని అరకొరగా చెల్లింపులు జరిపారు. కోర్టును ఆశ్రయించని అనేక మంది కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లింపులకు నోచుకోకుండా ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు ఉపాధి పనుల పెండింగ్ బిల్లుల విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లారు. దీనిపై స్పందించిన కేంద్రం జిల్లాలో 2014-19 మధ్య కాలంలో చెల్లింపులకు నోచుకోకుండా పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులకు రూ.8.20 కోట్లు మంజూరు చేసింది. వాస్తవానికి ఈ పనుల వివరాలను గత వైసీపీ ప్రభుత్వం ఉపాధి హామీ ఆన్‌లైన్ పోర్టల్ నుంచి తొలగించింది. దీంతో అన్ని మండలాల్లో పెండింగ్ బకాయిల వివరాలు, కాంట్రాక్టర్ల ఆన్‌లైన్ బ్యాంకు ఖాతాల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. త్వరలోనే పెండింగ్ బిల్లులను కాంట్రాక్టర్లకు చెల్లించేందుకు డ్వామా, ఇంజనీరింగ్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ పనుల బిల్లులు చెల్లింపునకు ప్రభుత్వం నిధులు కేటాయించిందని డ్వామా పీడీ పూర్ణిమాదేవి తెలిపారు. త్వరలోనే బకాయిలు సంబంధిత కాంట్రాక్టర్ల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయన్నారు.

20లోగా బీఎన్ రోడ్డు పనులు పూర్తి

జిల్లా జడ్జికి హామీ ఇచ్చిన ఆర్‌అండ్‌బీ ఎస్ఈ, ఎన్‌డీబీ కాంట్రాక్టర్

- గడువులోగా పనులు చేయకపోతే హైకోర్టు జోక్యానికి లేఖ రాస్తామని న్యాయమూర్తి వెల్లడి



కోర్టు వద్ద కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తున్న న్యాయవాది డేవిడ్

చోడవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):
చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలో అధ్వానంగా ఉన్న బీఎన్ రోడ్డును సెప్టెంబరు 20వ తేదీలోగా అభివృద్ధి చేస్తామని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ, ఎన్‌డీబీ కాంట్రాక్టర్ శనివారం స్థానిక 9వ అదనపు జిల్లా జడ్జి, లీగల్‌సెల్ అథారిటీ చైర్మన్ హరి నారాయణకు హామీ ఇచ్చారు. గోతులమయంగా ఉన్న బీఎన్ రోడ్డుపై స్థానిక లీగల్‌సెల్ అథారిటీలో న్యాయవాదులు కాండ్రేగుల డేవిడ్, భరత్ భూషణ్, భూపతి రాజు వేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన లీగల్‌సెల్ అథారిటీ చైర్మన్, 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి... కలెక్టర్, ఆర్‌డీవోలతో పాటు ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి ఏడుగురు ప్రభుత్వ అధికారులకు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. గత నెల 25న కోర్టు విచారణ సందర్భంగా కోర్టుకు హాజరైన ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారుల వాదన విన్న అనంతరం ఎన్‌డీబీ నిధులతో రోడ్డు పనులు పర్యవేక్షిస్తున్న ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీరుతో పాటు ఎన్‌డీబీ పనులు చేపట్టిన ఇద్దరు కాంట్రాక్టర్లు ఆగస్టు 23న వ్యక్తిగతంగా కోర్టు ఎదుట హాజరుకావాలని 9వ అదనపు జిల్లా జడ్జి, లీగల్‌సెల్ అథారిటీ చైర్మన్ హరినారాయణ ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో శనివారం ఆర్‌అండ్‌బీ సూపరింటెండెంట్ ఇంజనీర్ జాన్ సుధాకర్‌తో పాటు ఈఈ సాంబశివరావు, ఎస్ఆర్ కన్స్ట్రక్షన్‌కు చెందిన కాంట్రాక్టర్ వెంకట్‌లు కోర్టుకు హాజరై జిల్లా జడ్జికి వివరణ ఇచ్చారు. దీనిపై కోర్టులో కేసు వేసిన న్యాయవాదులు విలేకరులతో మాట్లాడుతూ కోర్టు నోటీసుల నేపథ్యంలో బీఎన్ రోడ్డులో గుంతల మరమ్మతు పనులు చేపట్టామని, అయితే ఈ రోడ్డు పనులకు సంబంధించి గతంలో మంజూరైన నిధులు తగ్గించి వేయడంతో ఆ మేరకు ... మిగతా 6వ పేజీలో

29న సీఎం రాక

ఉదయం నుంచి సాయంత్రం వరకూ పలు కార్యక్రమాలు

- డబుల్ డెక్కర్ బస్సుల ప్రారంభం
- వీఎంఆర్‌డీఏ ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం
- జాతీయ క్రీడా దినోత్సవం, అధికార భాషా దినోత్సవానికి హాజరు



విశాఖపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 29వ తేదీన నగరానికి రానున్నారు. ఆరోజు ఉదయం 11 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని నేరుగా నోవాటెల్ హోటల్‌కు వెళతారు. అక్కడ ఏర్పాటుచేసే కార్యక్రమాల్లో పాల్గొంటారు.
అనంతరం పర్యాటక శాఖకు చెందిన డబుల్ డెక్కర్ బస్సులు, వీఎంఆర్‌డీఏ చేపట్టిన ప్రాజెక్టులు ప్రారంభిస్తారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి హాజరవుతారు. అనంతరం ప్రో కబడ్డీ పోటీలు ప్రారంభిస్తారు. అలాగే గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే అధికార భాషా దినోత్సవంలో పాల్గొంటారు. ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమాలు ఇంకా అధికారికంగా ఖరారు కావల్సి ఉంది.

అంగన్‌వాడీ భవనాలకు మోక్షమెన్నడో?

జిల్లాలో మొత్తం 1,908 కేంద్రాలు

- కొన్ని శిథిలావస్థలో, మరికొన్ని అరకొర వసతులతో అద్దె భవనాల్లో..
- అసంపూర్తి నిర్మాణాలతో 208
- తాజా పరిస్థితులపై నివేదిక కోరిన ప్రభుత్వం



నర్సీపట్నంలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

నర్సీపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):
జిల్లాలో పలు అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మరిన్ని సొంత భవనాల్లో నిర్వహిస్తున్నా శిథిలావస్థలో ఉన్నాయి. జిల్లాలో అసంపూర్తి నిర్మాణాలతో ఉన్న 208 అంగన్‌వాడీ భవనాలు పూర్తయితే గానీ కొంత మేర సమస్య పరిష్కారం కాదు. కూటమి ప్రభుత్వం వచ్చాక వీటిపై నివేదిక కోరింది. దీంతో వీటికి మోక్షం కలుగుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 1,908 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో సొంత భవనాల్లో నడుపుతున్నవి 892 ఉన్నాయి. అద్దె లేకుండా పాఠశాలల భవనాల్లో నిర్వహిస్తున్నవి 396 ఉన్నాయి. అద్దె భవనాలలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు 620 ఉన్నాయి. ప్రభుత్వం పట్టణ ప్రాంతాలలో రూ.6000, రూరల్ ప్రాంతంలో రూ.2 వేలు చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. అద్దె భవనాల్లో సరైన సౌకర్యాలు, ఆట స్థలాలు ఉండడం లేదు.

శిథిలావస్థలో కొన్ని కేంద్రాలు

నర్సీపట్నం మండలం మొండికండి, బుచ్చన్నపాలెం శిథిలావస్థకు చేరుకోవడంతో అద్దె భవనంలోకి మార్చారు. లింగాలపాలెం, కృష్ణాపురం, దుగ్గాడ, చిన్నఉప్పర గూడెం, బంగారిపేట, కశిరెడ్డిపాలెం, కె.అగ్రహారం, అంగన్‌వాడీ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. గురందొరపాలెం, నగరం, అప్పన్నపాలెం కేంద్రాలు పాడైపోయిన భవనాల్లో నిర్వహిస్తున్నారు. మాకవరపాలెం-2 భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో తారా స్వచ్ఛంద సేవా సంస్థ భవనంలో ఒక గదిలో నిర్వహిస్తున్నారు. జెడ్ గంగవరం, కొండల అగ్రహారం భవనాలు అద్దె భవనాలలో నిర్వహిస్తున్నారు. రోలుగుంట మండలం అడ్డసార, రోలుగుంట-3 అంగన్‌వాడీ కేంద్రాలు సామాజిక భవనాలలో నడుపుతున్నారు. గొలుగొండ మండలం చోద్యంలో అంగన్‌వాడీ కేంద్రం పనులు ఆగిపోయి అసంపూర్తిగా ఉంది. చాలా ... మిగతా 6వ పేజీలో

కలెక్టర్ వరి నాట్లు

మునగపాక మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో కలెక్టర్ విజయకృష్ణన్ శనివారం వరి నాట్లు వేశారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఇక్కడికి వచ్చిన ఆమె రైతులతో కలిసి వరి నాట్లు వేసి అందరినీ ఉత్సాహపరిచారు. అనంతరం వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు, ఏవో జ్యోత్స్నకుమారి, తహశీల్దార్ సత్యనారాయణ ఉన్నారు.
- మునగపాక/ఆంధ్రజ్యోతి



వరి నాట్లు వేసి రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

త్వరలో శత శాతం వరినాట్లు పూర్తి

- యూరియా తదితర ఎరువుల సక్రమ పంపిణీకి చర్యలు
- జిల్లా వ్యవసాయ సమీక్ష సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రతినిధి శ్రీధర్



సమీక్ష సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రతినిధి శ్రీధర్, శాస్త్రవేత్తలు, అధికారులు

అనకాపల్లి అగ్రికల్చర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):
జిల్లాలో ఇంతవరకు రైతులు 30 శాతం వరినాట్లు వేశారని, మరో వారం పది రోజుల్లో నూరు శాతం పూర్తవుతాయని జిల్లా వ్యవసాయ శాఖ ప్రతినిధి కె.శ్రీధర్ తెలిపారు. ఇక్కడి ఆర్ఏఆర్ఎస్‌లో శనివారం ఏడీఆర్ డాక్టర్ శ్రీలత అధ్యక్షతన జరిగిన జిల్లా వ్యవసాయ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా తదితర ఎరువుల సక్రమ పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. జీవన ఎరువులు, నానో ఎరువుల వినియోగం పట్ల రైతులకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. ప్రకృతి వ్యవసాయం డీపీఎంసీహెచ్ లచ్చన్న మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ప్రకృతి వ్యవసాయం చేపడితే ఆరోగ్యకరమైన ఉత్పత్తులను సాధించ వచ్చునన్నారు. ఈ లక్ష్యంతోనే ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తుందని వివరించారు. ఈ నెల రెండో వారంలో కురిసిన వర్షాల వలన ఖరీఫ్ సీజన్ ఆశాజనకంగా మారిందని తెలిపారు. ఈ నెలలో ఇంతవరకు 54శాతం అధిక వర్షపాతం నమోదైనట్టు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ కేవీ రమణమూర్తి, డాక్టర్ విశాలాక్షి, డాక్టర్ ఉమామహేశ్వరరావు, వ్యవసాయ అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అతివలకు వరం 'స్త్రీశక్తి'

మన్నెంపాలెంలో న్యాయ శాస్త్రంపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న అదనపు జూనియర్ సివిల్ జడ్జి రమేష్

ఎలమంచిలి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గిరిజన గ్రామం మన్నెంపాలెంలో శనివారం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ శాస్త్ర అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలమంచిలి కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.రమేష్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు చట్టపరంగా కల్పిస్తున్న హక్కుల గురించి తెలియజేశారు. అంటరానితనం నేరమన్నారు. బాల్య వివాహాల వల్ల అనర్థాలు, నేరస్తులకు విధించే శిక్షలు, అందించే న్యాయ సహాయం తదితరాలను వివరించారు. అంతా సోదరభావంతో మెలగి, భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వరహాలు, డాక్టర్ సుగుణ, ఏజీపీ డి.వెంకటరావు, బార్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్వీ రామకృష్ణ, న్యాయవాదులు టి.నూకరాజు, బి.హరిశంకరరావు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీకి పూర్వ వైభవమే లక్ష్యం కావాలి : ధర్మశ్రీ



కొప్పుగొండుపాలెంలో మాట్లాడుతున్న ధర్మశ్రీ

రాంబిల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో వైసీపీకి పూర్వ వైభవం తేవడమే అందరి లక్ష్యం కావాలని ఆ పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. మండలంలోని కొప్పుగొండుపాలెం, చినకలవలాపల్లి, కొత్తపేట గ్రామాల్లో శనివారం పర్యటించి మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను పార్టీ శ్రేణులు గ్రామ గ్రామాన విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పి.కిషోర్, జడ్పీటీసీ ధూళి నాగ రాజు, నాయకులు నెట్టెం సత్యానారాయణ, కొవిరి రామకృష్ణ, సర్పంచ్ బద్ది హరి, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో బార్ ఏర్పాటుకు దరఖాస్తులు

ఎలమంచిలి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కొత్త బార్ పాలసీ ఆధారంగా ఎలమంచిలి మునిసిపాలిటీలో ఒక బార్ ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఎక్సైజ్ సీఐ తేజో వెంకట కుమార్ శనివారం తెలిపారు. ఈ నెల 18వ తేదీన జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి వి.సుధీర్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. దీనికి సంబంధించి ఈనెల 26వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఈనెల 28వ తేదీన అనకాపల్లి కొండకొప్పాకలో గల జిల్లా కార్యాలయంలో డ్రా తీయడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా గీత కులాలకు గాను ఈ నెల 29న దరఖాస్తు స్వీకరించి, 30వ తేదీన డ్రా తీయడం జరుగుతుందని వివరించారు.

▸ మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం
▸ ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్



మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, చిత్రంలో ప్రగడ నాగేశ్వరరావు, చలపతిరావు

అచ్యుతాపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మహిళల సాధికారత కోసమే కూటమి ప్రభుత్వం స్త్రీశక్తి పథకాన్ని ప్రవేశపెట్టినట్టు ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ వెల్లడించారు. శనివారం ఇక్కడి ఓ ప్రైవేటు సమావేశం మందిరంలో ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారన్నారు. ఇందులో భాగంగానే వీరి కోసం వివిధ పథకాలను రూపొందిస్తున్నట్టు చెప్పారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా అమలు చేస్తున్న ఉచిత బస్సు సౌకర్యం మహిళలకు ఎంతో లాభదాయంగా ఉందన్నారు. ముఖ్యంగా ఉద్యోగులు, చిరు వ్యాపార మహిళలకు ఈ పథకం వరం వంటిదన్నారు. అంతకు ముందు పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజానసన్యాసి నాయుడు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు తదితరులు పాల్గొన్నారు.

'ఆసక్తి ఉన్నవారికి ఉద్యోగ కల్పనే లక్ష్యం'

మునగపాక : నియోజకవర్గంలో ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగ కల్పనే లక్ష్యంగా ప్రతి మండలంలో జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మండలంలోని తిమ్మరాజుపేట డావిన్సీ పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాను ప్రారంభించి మాట్లాడారు. వేతనం కొలమానంగా భావించకుండా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏడాదిలో రెండు, మూడు జాబ్‌మేళాలు నిర్వహించాలని భావిస్తున్నట్టు చెప్పారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన సన్యాసినాయుడు మాట్లాడుతూ కంపెనీలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతో స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. స్కిల్ డెవలెప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ విభాగం ప్రతినిధి గోవిందరావు మాట్లాడుతూ జాబ్ మేళాకు 24 కంపెనీలు వచ్చాయని, సుమారు 1200 దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కూటమి నాయకులు రాజాన రమేష్‌కుమార్, టెక్కలి పరశురాం, కాండ్రేగుల గాంధీ, మళ్ల కాళ్లేశ్వరరావు, డావిన్సీ స్కూల్ డైరెక్టర్ జె.రమణాజీ తదితరులు పాల్గొన్నారు.

'ఆటిజం పిల్లల ప్రోత్సాహానికి రాష్ట్రంలో 125 సెంటర్లు ఏర్పాటు'

ఎలమంచిలి : రాష్ట్రంలో బుద్ధి మాంద్యం (ఆటిజం) పిల్లలకు ప్రోత్సాహం అందించేందుకు పీఎంశ్రీ పథకం ద్వారా రాష్ట్రంలో 125 సెంటర్లు ఏర్పాటు చేయడం గొప్ప విషయమని ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి శుక్రవారం జీవో విడుదలైందని వివరించారు. ఇందుకోసం అడ్వయిజరీ గ్రూపు క్రింద ఎమ్మెల్యేలను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. తనతో పాటు పార్థసారధి, పూసపాటి అదితి గజపతి, కాకర్ల సురేష్, కంచెర్ల శ్రీకాంత్ ఉన్నట్టు వివరించారు. ఈ బృందం సలహాలు, సూచనలు ఇవ్వనుందని పేర్కొన్నారు. ఆటిజంతో ఇబ్బంది పడుతున్న పిల్లలకు, వారి తల్లిదండ్రులకు ప్రభుత్వం మంచి సదుపాయం కలిగించినందుకు వారంతా కృతజ్ఞతలు తెలుపుతున్నారన్నారు.

అందాల మిడత

▸ వివిధ రకాల వర్ణాలతో ఆకట్టుకున్న కీటకం



ఇందిరమ్మ కాలనీలో ఓ ఇంటి వద్ద గల చెట్టుపై వాలిన మిడత

అచ్యుతాపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం అచ్యుతాపురంలోని ఇందరమ్మ కాలనీలో శనివారం ఓ రంగుల మిడత పలువుర్ని ఆకట్టుకుంది. సాధారణంగా మిడతలు ఆకుపచ్చ రంగులో ఉంటాయి. కానీ వివిధ రకాల వర్ణాలతో మిడత ఇందిరమ్మ కాలనీలో ఒక ఇంటి వద్ద చెట్టుపై వాలడంతో అక్కడివారంతా ఆసక్తిగా తిలకించారు. ఆ ఇంటి యజమాని తన సెల్‌ఫోన్ కెమెరాలో ఈ అందాల కీటకాన్ని బంధించారు.

బిల్లులు లేని ఆరు వాహనాలకు రూ.94 వేల జరిమానా

▸ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి

ఎలమంచిలి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధి కొత్త ఎర్రవరం సమీపంలోని రహదారి మీదుగా శనివారం బండ రాళ్లను రవాణా చేస్తున్న ఆరు లారీలకు బిల్లులు లేకపోవడంతో 94 వేల రూపాయలు జరిమానా విధించినట్టు మైన్స్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆర్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ వాహనాల్లో బండ రాళ్లను తరలిస్తుండగా గుర్తించి ఆపామన్నారు. వీటికి సంధించిన పత్రాలు కోరగా సదరు సిబ్బంది చూపకపోవడంతో వాహనాలను అదుపులోకి తీసుకుని జరిమానా విధించినట్టు చెప్పారు. అనంతరం వాటిని ఎలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. వాహనదారులు ఎంతటి వారైనా విడిచిపెట్టేది లేదని హెచ్చరించారు.

ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో డ్రైవర్ల ధర్నా



తహశీల్దార్ కార్యాయం వద్ద నినాదాలు చేస్తున్న ఆటో డ్రైవర్లు

అచ్యుతాపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. ఇక్కడి తహశీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ఆటో డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్ల ఆదాయానికి గండిపడిందన్నారు. దీంతో ఆయా కటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నాయన్నారు. అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసిన వారి పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వీరిని ఆదుకోవాల్సిందిగా కోరారు. అనంతరం తహశీల్దార్ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.సోమునాయుడు, సంతోష్, చంటి, కర్రి నాయుడు, శ్రీను, పైడికొండ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్‌కు అభినందనలు



ఆనంద్‌కు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న అభిమానులు

ఎలమంచిలి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) భారతీయ జనతాపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్‌ను శనివారం పలువురు నాయకులతో పాటు అభిమానులు, ఆయన అనుచరులు తదితరులు అభినందించారు. ఇక్కడి నుంచి విశాఖలో ఉన్న ఆయన నివాస గృహానికి అంతా తరలి వెళ్లారు. పుష్పగుచ్ఛాలను అందజేసి సత్కరించారు. మరిన్ని పదవులు అధిరోహించడంతో పాటు జిల్లాకు మంచి గుర్తింపు తేవాలని వారంతా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆడారి వెంకట్, దొడ్డి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కోసం ఆందోళన

మునగపాక, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయానికి అవసరమైన మేర యూరియాతో పాటు ఇతర ఎరువులను సరఫరా చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. ఇక్కడి పీఏసీఎస్ వద్ద శనివారం ఎరువుల కోసం పలువురు రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరకొ ఎరువుల వలన రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. వెంటనే జిల్లాకు అవసరమైన ఎరువులను పంపించి రైతులను ఆదుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్. బ్రహ్మాజీ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆడారి ఆనంద్‌కు ఘనస్వాగతం



ఆడారి ఆనంద్‌ను సత్కరిస్తున్న కూటమి నాయకులు

నక్కపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన విశాఖడెయిరీ సీఈవో ఆడారి ఆనంద్ కుమార్‌కు శనివారం మధ్యాహ్నం నక్కపల్లిలో కూటమి నాయకులు ఘనస్వాగతం పలికారు. విశాఖ నుంచి విజయవాడ వెళ్తున్న ఆనంద్‌కు నక్కపల్లి బీజేపీ కార్యాలయం వద్ద బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవిరాజు, మండలశాఖ అధ్యక్షుడు పోలినాటి నానాజీ, నక్కపల్లి సొసైటీ డైరెక్టర్లు కోసూరి శ్రీను, మనబాల కొండబాబు ఘనస్వాగతం పలికి సత్కరించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుని పగ్గాలు ఆనంద్‌కు ఇవ్వడంతో ఉత్తరాంధ్రలో పార్టీ మరింత బలోపేతమవుతుందని కూటమి నాయకులు అభిప్రాయపడ్డారు. ఆనంద్‌ను కలిసిన వారిలో పార్టీ జిల్లా సెక్రటరీ దాడిశెట్టి ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జీ, కేవీ సత్యనారాయణ, దేవవరపు లోవరాజు, పెదిరెడ్డి రమేశ్, తదితరులున్నారు.

ముగిసిన ఎంఎస్‌ఎంఈ శిక్షణ



ఆడారి ఆనంద్‌ను సత్కరిస్తున్న కూటమి నాయకులు

పాయకరావపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల ఏర్పాటు, ప్రభుత్వ ప్రోత్సాహం తదితర అంశాలపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పాయకరావుపేటలో నిర్వహించిన ఎంఎస్‌ఎంఈ శిక్షణ తరగతులు ముగిశాయి. ఈ సందర్భంగా శవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శిక్షకుడు శీలి జీవన్ మాట్లాడుతూ, ట్రేజ్ ఐటీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వి.ప్రసాద్ పర్యవేక్షణలో గత నెల 21వ తేదీ నుంచి నెల రోజులపాటు నిర్వహించిన ఈ శిక్షణ తరగతుల్లో ఔత్సాహిక పారి శ్రామికవేత్తలకు పరిశ్రమల ఏర్పాటు, లాభ నష్టాలు, ప్రభుత్వ ప్రోతాహకాలు తదితర అంశాలపై అవగాహన కల్పించామన్నారు. రెండో బ్యాచ్ త్వరలో ప్రారంభం కానుం దన్నారు. 18 నుంచి 45 ఏళ్ల ఔత్సాహిక నిరుద్యోగ యువతీ యువ కులు వివరాలకు ఫోన్లు: 99514 47776, 63028 30515లో సంప్ర దించాలని అయన కోరారు. ముగింపు కార్యక్రమంలో మన్నా స్కూల్ ప్రిన్సిపాల్ చార్లెస్ ప్రసన్నరాణి, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ టాపర్‌కు సన్మానం

ఎస్. రాయవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వమ్మవరం అగ్రహారంనకు చెందిన సుంకరణం విజయ్ ప్రకటించి శుక్రవారం రాత్రి ప్రకటించిన ఫలితాల్లో పీజీటీ, టీజీటీ, ఎస్ఏ గణితం ఈ మూడింటిలోనూ రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకులు సాధించడం ఎంతో గర్వించదగిన విషయమని పీఆర్‌టీయూ జిల్లా నాయకుడు విశ్వేశ్వరరావు కొనియాడారు. శనివారం యూనియన్‌కు చెందిన మండల నాయకులు, ఉపా ధ్యాయులతో పాటు కలిసి విశ్వేశ్వరరావు విజయ్ నివాసానికి వెళ్లి అతడిని అభినందించడంతోపాటు విజయ్‌ను ఘనంగా సన్మానించారు.

డీఎస్సీలో మెరిసిన విద్యా కుసుమాలు

పాయకరావుపేట/రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ ఫలితాల్లో మండలానికి చెందిన పలువురు ర్యాంకులు సాధించి సత్తాచాటారు. మండలంలో పాల్తేరు గ్రామానికి చెందిన అడపా దుర్గాప్రసాద్ స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)లో 78 మార్కులతో 11వ ర్యాంకు, టీజీటీలో 13వ ర్యాంకుతో సత్తాచాటారు. పేద కుటుంబానికి చెందిన దుర్గాప్రసాద్ తండ్రి చనిపోయారు. అతను చిన్నతనం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివాడు. దుర్గాప్రసాద్ ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. డీఎస్సీలో సాధించాలని గత మూడేళ్లుగా కష్టపడి చదివానని దుర్గాప్రసాద్ తెలిపాడు. అరట్లకోట గ్రామంలో ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో సుమారు ఎనిమిదిమంది వరకు వివిధ క్యాటగిరీల్లో మంచి ర్యాంకులు సాధించారు. వీరిలో గర్లంక శ్రావణి స్కూల్ అసిస్టెంట్ (మ్యాథమెటిక్స్)లో 81 మార్కులు సాధించి 8వ ర్యాంకు సాధించి సత్తాచాటారు.. ప్రస్తుతం ఈమె మునగపాక కేజీబీవీలో సీఆర్టీగా పనిచస్తున్నారు. సత్యవరంలో రైతు కుటుంబానికి చెందిన పాలపర్తి సుశీల ఎస్‌జీటీలో 20వ ర్యాంకు సాధించారు. మండలంలో మత్స్యకార గ్రామం వెంకటనగరం పంచాయతీ రాజానగరానికి చెందిన వంకా అమ్మాజీ స్కూల్ అసిస్టెంట్ (బయోలజీ)లో 26వ ర్యాంకు సాధించారు.

పీకేపల్లి ముగ్గురి యువకులకు ర్యాంకులు

కోటవురట్ల: మెగా డీఎస్సీ ఫలితాల్లో పీకేపల్లిలో గ్రామంలో ముగ్గురు యువకులు మంచి ర్యాంకులు సాధించారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో సోషల్ సబ్జెక్టు స్కూల్ అసిస్టెంట్ విభాగంలో శెలం శెట్టి నర్సింహమూర్తి ఎనిమిదవ ర్యాంకు సాధించారు. నర్సింహమూర్తి తండ్రి జోగారావు టైలరింగ్ వృత్తిద్వారా జీవోపాధిపొందుతున్నారు. అదే గ్రామానికి చెందిన రొంగల దేవుడునాయుడు సోషల్ సబ్జెక్టు స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 12వ ర్యాంకు సాధించి సత్తా చాటారు. ఆయన తండ్రి సూర్యనారాయణ చిన్నతనంలో చనిపోయారు. తల్లి కష్టార్జితంపై ఆధారపడి దేవుడునాయుడు చదువుకుంటున్నారు. ఇదే గ్రామానికి శెలం శెట్టి నాగేశ్వరరావు బయోలాజికల్ సైన్స్ సబ్జెక్టు స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 27వ జిల్లా స్థాయిలో ర్యాంకుసాధించారు. నాగేశ్వరరావు టైలరింగ్ వృత్తిద్వారా జీవోపాధిపొందుతున్నారు. గ్రామస్థులు హర్షం వ్యక్తంచేశారు.



తెలుగు , టీజీటీలో ర్యాంకులు సాధించిన ఎ.దుర్గాప్రసాద్

స్కూల్ అసిస్టెంట్ 8వ ర్యాంకు సాధించిన సుశీల

శ్రావణి స్కూల్ అసిస్టెంట్ 8వ ర్యాంకు

వంకా అమ్మాజీ బయాలజీ 26 ర్యాంక్

చెక్కా శృతి ఎస్‌జీటీలో ర్యాంక్

నర్సింహమూర్తి సోషల్ స్కూల్ అసిస్టెంట్‌లో 8వ ర్యాంకు

దేవుడుబాబు స్కూల్ అసిస్టెంట్ 12వ ర్యాంకు

నాగేశ్వరరావు.. బయాలజీ 27 వ ర్యాంక్

'ఆశ' కుటుంబంనుంచి ఉపాధ్యాయినిగా ఎంపిక

కోటవురట్ల: డీఎస్సీ ఫలితాల్లో మండలం జల్లూరు గ్రామంలో ఆశ కార్యకర్త కుమార్తె చెక్కా శృతి ఎస్‌జీటీలో 84.6 మార్కులు సాధించింది. ఎస్సీ గ్రూపు-3 (102) ర్యాంకు సాధించారు. శృతి తండ్రి చెక్కా అప్పారావు పెట్రోల్ బంకుల్లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా శృతి మాట్లాడుతూ, తల్లిదండ్రులు ప్రో త్సాహంతో టీచర్ ట్రైనింగ్‌చేశానన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా డీస్సీ కోచింగ్ పంపించినట్టు తెలిపారు. టీచర్ పోస్టు రావడంతో కష్టాలు తీరుతాయని ఆమె అన్నారు.

హెటెరో అక్రమ నిర్మాణం పరిశీలన



న్యాయంపూడిలో పరిశీలిస్తున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారిణి

నక్కపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యాయంపూడి గ్రామంలో పంచాయతీ అనుమతులు, తీర్మానాలులేకుండా జనావాసాల మధ్య ఉన్న హెటెరో ఔషధ పరిశ్రమ కెమికల్ ల్యాబ్‌పై స్థానిక ఎంపీటీసీ సభ్యుడు ఆకేటి గోవిందరావు అభ్యంతరం వ్యక్తంచేస్తూ ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారిణి న్యాయంపూడిలో పర్యటించి, నిర్మాణం జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు ఆకేటి గోవిందరావు మాట్లాడుతూ, జనావాసాల మధ్య అక్రమంగా హెటెరో యాజమాన్యం ప్రజలను మభ్యపెట్టి ప్రమాదకర రసాయన పదార్థాలను నిల్వచేసే గొడౌన్‌లు, ల్యాబ్‌లు నిర్మిస్తే ఎలా అని ప్రశ్నించారు. తక్షణమే అధికారులు వీటి నిర్మాణాలు ఆపాలని, లేకపోతే న్యాయపోరాటం సాగిస్తామని హెచ్చరించారు. కాలుష్య నియంత్రణమండలి అధికారులు దీనిపై నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కురందాసు అప్పలరాజు, బంగారి రాజు, దేవవరపు సోమరాజు ,రెడ్డి అప్పారావు పాల్గొన్నారు.

రసాయన వ్యర్థాలకు మూగ జీవాలు మృత్యువాత

నక్కపల్లి: హెటెరో యాజమాన్యం నేరుగా ఉప్పుటేరులోకి రసాయన వ్యర్థ జలాలను విడిచిపెట్టడం వల్ల, ఆ నీటిని తాగి శనివారం ఉదయం బొందలపు విజయ్‌కు చెందిన రెండు ఆవులు మృత్యువాత పడినట్టు రాజయ్యపేటకు చెందినగ్రామస్థులు ఆందోళన వ్యక్తంచేశారు. పశువులు మృతి చెందిన రైతుకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర'పై ర్యాలీలు



శ్రీరాంపురంలో ర్యాలీ చేస్తున్న

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):మండలంలోని శ్రీరాంపురం, సత్యవరం, మంగవరం, నామవరం, మాసాహెబ్‌పేట, పెదరాంభద్రపురం తదితర గ్రామాల్లో సచి వాలయ, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞను చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వై.వి. సత్యనారాయణ, నాయుడు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

నక్కపల్లి:మండల పరిషత్ కార్యాలయం వద్ద స్థానిక ఎంపీడీవో డీ సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు నేతృత్వంలో స్వచ్ఛాంధ్ర కార్య క్రమం నిర్వహించారు. వేంపాడు ఆయుష్ ఆస్పత్రిలో డాక్టర్ కె.రఘు ఆధ్వర్యంలో పరిసరాల్లో తుప్పలు తొలగించారు. పెదబోదిగల్లం హైస్కూల్‌లో హెచ్‌ఎం జయశ్రీ, ఉపాధ్యాయులు ఎన్‌వీఎస్ ఆచార్యులు, పద్మావతి, ఫాల్గుణరావు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు.

ఎరువుల షాపులు తనిఖీ

కోటవురట్ల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పురుగుల మందులు, ఎరువుల షాపులను శనివారం మండల ప్రత్యేకాధికారిణి శోభారాణి ఆధ్వర్యంలో తహసీల్దార్ తిరుమలబాబు, ఎంపీడీవో చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యు ఎస్ ఏఈ శ్రీనివాసరావు, ఏవో సరోజని తనిఖీ చేశారు. షాపుల్లోని యూరియా నిల్వలు, విక్రయాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ఎరువులు అధిక ధరలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అమ్మకాలపై రసీదు ఇవ్వాలని ఆదేశించారు.

విజయ్‌ప్రకాష్‌కి సీఎం ప్రశంస



సీఎం చంద్రబాబు నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ విజయ్‌ప్రకాష్

పాయకరావుపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ సీహెచ్. విజయ్‌ప్రకాష్ ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి ప్రశంసలు అందుకున్నారు. శనివారం విద్యా సంస్థల యాజమాన్యం ఈ వివరాలందించింది. ప్రభుత్వం చేపట్టిన జీరో పావర్టీ-పీ4 కార్యక్రమంలో భాగంగా వీజయ్‌ప్రకాష్ రెడ్‌క్రాస్ చైర్మన్‌గా పలు పేద కుటుంబాలను దత్తత తీసుకుని వారిబాగోలు చూసుకునేందుకు నిర్ణయించారన్నారు. ఇందులో భాగంగా శనివారం వజ్రపు వీరలక్ష్మి కుటుంబాన్ని దత్తత తీసుకున్న సందర్భంగా కాకినాడ జిల్లా పెద్దాపురం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా విజయ్‌ప్రకాష్ ప్రశంసాపత్రం అందుకున్నట్టు చెప్పారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి: డీఆర్‌డీఏ పీడీ



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శచీదేవి

నక్కపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మహిళలు బ్యాంకుల ద్వారా తీసుకున్న స్త్రీనిధి, ఇతర బ్యాంకు రుణాలను జీవనోపాధి మెరుగుదలకు ఉపయోగించుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి సూచించారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన మహిళా సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రుణాల సద్వినియోగంతో ఆర్థిక స్వావలంబన సాధించవచ్చునని అన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పంటలపై అధిక ధరలను పొందవచ్చునని సూచించారు. పశువుల పెంపకం ద్వారా పాల ఉత్పత్తులను పెంచుకుని, అదనపు ఆదాయం సమకూర్చుకోవాలని కోరారు. సమావేశంలో ఏపీఎం శ్రీనివాస్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అనంత లక్ష్మి, సెక్రటరీ మాధురి, కోశాధికారి తేజ తదితరులు పాల్గొన్నారు.



ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న అధికారులు

టంగుటూరికి ఘన నివాళి



టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరి ప్రకాశం పంతులు చూపిన సాహసం, స్వాతంత్ర్య పోరాటాల స్ఫూర్తితో మన వంతుగా దేశ సేవ చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతి కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించారు. ముందుగా కలెక్టర్ విజయకృష్ణన్ టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో వై.సత్యనారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో అధికారుల తనిఖీలు



పట్టణంలోని ఓ ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో శనివారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మల్టీ డిసిప్లీనరీ టీమ్స్‌ను సంబంధిత తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్‌హెచ్‌వో, మండల ప్రత్యేకాధికారి, ఎంఏఓలతో ఏర్పాటు చేసిన బృందాలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ప్రతి దుకాణానికి ఒక వీఆర్‌ఏను నియమించి ఎరువుల అమ్మకపు ధరను పర్యవేక్షింపజేశారు. దీనికి సంబంధించి జిల్లా వ్యవసాయ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు తెలిపారు. జిల్లాలో ఉన్న సాగు విస్తీర్ణం ఆధారంగా ఎరువుల సరఫరా, సభ్యత వివరాలపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించడమైందన్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి, మార్క్‌ఫెడ్ మేనేజర్ జిల్లాకు యూరియా కేటాయింపులపై సమన్వయం చేసుకొని సొసైటీలు, ఆర్‌ఎస్‌కేలకు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 54,465 హెక్టార్ల వరి సాగు విస్తీర్ణం కాగా, ఇప్పటి వరకు 20వేల హెక్టార్లలో రైతులు నాట్లు వేశారన్నారు. ఈ నెలాఖరుకు 40వేల హెక్టార్లలో నాట్లు పూర్తవుతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 2,251 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, ఇంకా రెండువేల టన్నులు అవసరం ఉందని నివేదిక సమర్పించామన్నారు. జిల్లాలో యూరియా కొరత లేదని ఆయన స్పష్టం చేశారు.

వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట : గండి బాబ్జీ



మొగలిపురంలో రైతులకు ఎరువులు అందజేస్తున్న గండి బాబ్జీ

సబ్బవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌లో అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ వ్యవసాయాధికారులకు సూచించారు. మండలంలోని మొగలిపురం సచివాలయంలో శనివారం ఆయన సబ్సిడీపై రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయాల వారీగా రైతులకు ఎన్ని బస్తాల ఎరువులు అవసరమో ముందుగానే గుర్తించి, ప్రణాళికలు సిద్ధం చేసుకుని తద్వారా తెప్పించాలన్నారు. వ్యవసాయ రంగానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ గండి దేముడు, ఎంపీటీసీ తమరాన సన్యాసమ్మ, నీటి సంఘం అధ్యక్షులు గండి పెంటయ్య, గ్రామ పెద్దలు అంగటి నానాజీ, సబ్బవరపు ఉమాదేవి, సత్తిబాబు పాల్గొన్నారు.

అర్హులైన దివ్యాంగుల పింఛన్లు రద్దు కావు : మళ్ల



పింఛన్ల మంజూరు పత్రాలను అందజేస్తున్న సురేంద్ర

అనకాపల్లి టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నిదానందొడ్డి పరమేశ్వరీ పార్కు జంక్షన్‌లో గల సచివాలయంలో దివ్యాంగులకు శనివారం గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర నూతన పింఛన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులందరికీ పింఛన్లు అందుతాయన్నారు. దివ్యాంగుల పింఛన్లు తొలగిస్తున్నారంటూ చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. గత ప్రభుత్వంలో అడ్డదారిలో సదరం సర్టిఫికెట్లు తీసుకొని పింఛన్ పొందుతున్న వారిపై ఇటీవల జరిపిన పునఃపరిశీలన వివరాలను అధికారులు తెలియజేశారన్నారు. నకిలీ పింఛన్లు మాత్రమే తొలగించాలని, అర్హులైన ఏ ఒక్క దివ్యాంగుడి పింఛన్ రద్దు కాకూడదని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ, ఎంపీ సీఎం రమేష్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. నాయకులు విల్లూరి హరి, దాడి వాసు, పెతకంశెట్టి జగన్మోహనరావు, సదరం శివఅప్పారావు, పెంటకోట శివరాం పాల్గొన్నారు.

నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి రింగు రోడ్డులోని నెట్స్ గ్రౌండ్‌లో శనివారం నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. వైసీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ జన్మదిన వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న ఈ పోటీలను వైసీపీ యువజన విభాగం నాయకుడు మలసాల కుమార్‌రాజా ప్రారంభించారు. పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు జాజుల రమేష్, దంతులూరి శ్రీధర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

▸▸ మరొకరికి తీవ్ర గాయాలు ▸▸ పరిస్థితి విషమం

చోడవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకన్నపాలెం జంక్షన్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ముద్దుర్తి కొత్తపల్లి గ్రామానికి చెందిన ఏజుడ రామునాయుడు (42), నంబారు సోమునాయుడు శనివారం రాత్రి తమ గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై వెంకన్నపాలెం వస్తుండగా, అదే గ్రామానికి చెందిన వ్యాన్ వారిని ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న రామునాయుడు సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. వెనుక కూర్చొన్న నంబారు సోమునాయుడుకు రెండు కాళ్లు విరిగిపోవడంతో పాటు తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన్ను అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఎస్ఐ జోగారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలపై విచారిస్తున్నారు.



జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి



ఎన్టీఆర్ వైద్యాలయం ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం వైద్యులు, సిబ్బంది ప్రతిన



సబ్బవరం మండలం బంగారమ్మపాలెంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి తదితరులు అవగాహన ర్యాలీ

చక్కగా పాలిస్తాం.. చెత్తనూ ఊడ్చేస్తాం

▸▸ ఉత్సాహంగా 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' ▸▸ చీపుర్లు చేతబట్టి కార్యాలయాల ఆవరణలను శుభ్రం చేసిన కలెక్టర్, ఎస్పీ తదితర అధికారులు

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలో పరిసరాల పరిశుభ్రతను చేపట్టారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ జాహ్నవితో కలిసి పేరుకుపోయిన పిచ్చి మొక్కలతో పాటు, చెత్తను కలెక్టర్ తొలగించారు. పరిసరాల పరిశుభ్రతకు అంతా అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో వై. సత్యనారాయణరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో...

ఇక్కడి జిల్లా పోలీస్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ తుహిన్‌సిన్హా, ఏఎస్పీ ఎల్.మోహనరావుతో పాటు అధికారులు కార్యాలయ పరిసరాల్లో చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్ : స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని వివిధ ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో నిర్వహించారు. డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.హైమావతి సిబ్బందితో చెత్తాచెదారాన్ని తొలగించి, ప్రతిజ్ఞ చేశారు. సూపరింటెండెంట్ శేషుకుమార్, ఎస్.రమణ, డీఎస్‌వో షరీఫ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది వైద్యాలయ ఆవరణలో పరిశుభ్రత పనులు చేపట్టారు. అలాగే, ఆర్టీసీ డిపో ఆవరణలో డీపీటీవో వి.ప్రవీణ, డిపో సహాయ మేనేజర్ గౌరిలు పరిశుభ్రత చేపట్టి, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. భీమునిగుమ్మం డాక్టర్ అంబేడ్కర్ ఉన్నత పాఠశాలలో ఆయుష్ వైద్యురాలు కె.లావణ్య విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్బవరం : ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ గ్రామాలు సాధ్యమని మండల ప్రత్యేకాధికారిణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి అన్నారు. మండలంలోని మొగలిపురం, సబ్బవరం, గుల్లేపల్లి, ఆరిపాక బంగార మ్మపాలెం తదితర గ్రామాల్లో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. బంగారమ్మపాలెంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో కె.శివప్రసాద్ నారాయణరావు, సర్పంచ్‌లు గండి అరుణ, దాడి లావణ్య, ఈవోపీఆర్‌డీ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : ముత్యాలమ్మపాలెంలో సర్పంచ్ చింతకాయల సుజాత ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మాజీ సర్పంచ్ చింతకాయల ముత్యాలు, పంచాయతీ కార్యదర్శి రజని, స్థానిక నాయకులు మైలపల్లి అప్పన్న, సూరాడ ముత్యాలరావు, ఒలిశెట్టి అప్పలరాజు, అర్జిల్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయా సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.





కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయ ఆవరణల్లో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా తదితర అధికారులు

చవితి వేడుకల్లో హద్దుమీరితే చర్యలు

▸▸ రౌడీ షీటర్లకు డీఎస్పీ శ్రావణి హెచ్చరిక



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న డీఎస్పీ శ్రావణి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి వేడుకల్లో, మరే ఇతర ప్రదేశాల్లో వివాదాలకు దిగితే కఠిన చర్యలు తప్పవని అనకాపల్లి డీఎస్పీ ఎం. శ్రావణి రౌడీ షీటర్లకు హెచ్చరించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం రౌడీషీటర్లకు ఆమె కౌన్సిలింగ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కడైనా ఏ కార్యక్రమాల్లోనైనా తలదూర్చి శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దన్నారు. సన్మార్గంలో నడుచుకోవాలని, నిబంధనలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ టీవీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇదిలావుంటే, చవితి ఉత్సవాలను సంప్రదాయక బద్ధంగా జరుపుకోవాలని గణేశ్ ఉత్సవ కమిటీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు విల్లూరి శ్రీనివాసరావు సూచించారు. శనివారం ఇక్కడ మాట్లాడుతూ ఇటీవల విజయవాడ కేంద్రంగా రాష్ట్ర గణేశ్ ఉత్సవ కమిటీ ఏర్పాటైనట్టు చెప్పారు. జిల్లా కమిటీని కూడా నియమించారన్నారు. అధ్యక్షుడిగా బంకుపల్లి సత్యనారాయణ, గౌరవాధ్యక్షునిగా డాక్టర్ డీడీ నాయుడు, ఉపాధ్యక్షులుగా కొణతాల అప్పలరాజు, పి.హరినాథ్, ప్రధాన కార్యదర్శులుగా చదరం బాబూరావు, కొణతాల సౌరబ్‌లతో పాటు మరికొందరిని నియమించినట్టు చెప్పారు. ఈ సమావేశంలో బొడ్డేడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



తుమ్మపాలలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న రత్నాకర్

ప్రకృతి సంబంధిత వస్తువులతోనే పూజలు

తుమ్మపాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి సంబంధిత వస్తువులతోనే ప్రతి ఒక్కరూ వినాయక చవితిని జరుపుకోవాలని టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ అన్నారు. శనివారం తుమ్మపాలలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేసి మాట్లాడారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వలన పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలనే పూజించాలని సూచించారు. స్థానిక నాయకులు బొడ్డపాటి చిన రాజారావు, కర్రి బాబి, నడిపల్లి బోసుబాబు, పెంటకోట వేగులమ్మనాయుడు, ఆడారి నాగరాజు, మత్తుర్తి మహేష్, కొత్తపల్లి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఉపకార వేతనాలు



విద్యార్థినులకు స్కాలర్‌షిప్ అందజేసిన వాసవీక్లబ్ ప్రతినిధులు

కశింకోట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పేద విద్యార్థినులకు శనివారం స్కాలర్‌షిప్‌లను అందజేశారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఒక్కొక్కరికీ రూ.వెయ్యి చొప్పున అందించారు. గతంలో పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటడం, విగ్రహాల ప్రతిష్ఠ, పదో తరగతిలో మెరిట్ సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, సీలింగ్ ఫ్యాన్లు, వంట సామగ్రి, పుస్తకాలు తదితరాలు అందజేసినట్టు వాసవీ దాత బెస్ట్ ఇండియన్ పులవర్తి సత్య వరహాలరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని శశికళ, కశింకోట వాసవీ క్లబ్ అధ్యక్షుడు జె.నూకరాజు, ప్రధాన కార్యదర్శి డి.వి.కె.గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కశింకోట : నర్సింగబిల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కె.రవి కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతకు అధిక ప్రాధా న్యం ఇవ్వాలన్నారు. వర్షాకాలంలో వచ్చే అంటువ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కాచి వడబోసిన నీటిని తాగడం వల్ల కొంత వరకు వ్యాధులు దరిచేరవన్నారు. అనంతరం ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

25, 26 తేదీల్లో దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరం

పరవాడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలను గుర్తించేందుకు ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈనెల 25, 26వ తేదీల్లో ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్టు ఎన్టీపీసీ సీఎస్ఆర్ విభాగం అధికారి కె.ప్రకాశరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ శిబిరానికి హాజరయ్యే దివ్యాంగులకు ఎలాంటి ఉపకరణాలు అవసరమో ఏపీ మెప్‌టెక్ జోన్ ప్రతినిధులు గుర్తిస్తారన్నారు. దానికి అనుగుణంగా ఉపకరణాలను తయారు చేయించి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో ఉచితంగా అందజేయనున్నామని వివరించారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనున్న ఈ శిబిరాన్ని పరవాడ, పరిసర ప్రాంతాల దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

'ఉక్కు ప్రైవేటీకరణ యోచన తగదు'

తుమ్మపాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రయత్నాలను ప్రభుత్వం తక్షణమే నిలుపుదల చేయాలని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్‌రావు డిమాండ్ చేశారు. బవులువాడలో శనివారం సంఘం సమావేశంలో మాట్లాడారు. పోరాటాల ద్వారా సాధించుకున్న ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తే ఊరుకోమన్నారు. నవ యువ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గసభ్యుడు నందారపు భాస్కరరావు, సంఘం నాయకులు రమేష్, అప్పలనాయుడు, బాబూరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు మెరుగైన సేవలందించాలి

▸▸ జిల్లా మహిళా, శిశుసంక్షేమ శాఖాధికారిణి సూర్యలక్ష్మి

సబ్బవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ సిబ్బంది మరిన్ని మెరుగైన సేవలందించాలని జిల్లా మహిళా, శిశుసంక్షేమ శాఖాధికారిణి ఎస్. సూర్యలక్ష్మి సూచించారు. మండలంలోని ఇరువాడ, బాటజంగాలపాలెం-1 అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు గర్భిణులు, బాలింతలతో మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బంది ద్వారా అందుతున్న సేవలను తెలుసుకున్నారు. పౌష్టికాహారం, పరిశుభ్రతపై వివరించారు. పిల్లల బరువు, ఎత్తు పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారం కిట్లను సక్రమంగా అందజేయాలన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి హాజరయ్యారు. సీడీపీవో వి.లలితకుమారి, సూపర్‌వైజర్ డి. అప్పలనర్సమ్మ, మహిళా సంరక్షకులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



ఇరువాడలో అంగన్‌వాడీ సిబ్బందికి సూచనలిస్తున్న సూర్యలక్ష్మి

గాజుల అలంకరణలో ఘనమైన అమ్మ



అరుంధతీనగర్‌లో గాజుల అలంకరణలో నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గవరపాలెం అరుంధతీనగర్‌లో కొలువుదీరిన నూకాంబిక అమ్మవారిని శనివారం గాజులతో అలంకరించారు. అమావాస్య కావడంతో వేకువజామున అమ్మవారి విగ్రహాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్ది, విశేష పూజల అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

విశేష అలంకరణలో వెంకన్న



వక్షస్థలంపై లక్ష్మీదేవి అవతారంలో స్వామి దర్శనం

కశింకోట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం వేంకటేశ్వరస్వామి వక్షస్థలంపై లక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా కౌస్తుభం, సాలగ్రామ మాలతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అర్చకులు రేజేటి చరణ్ విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. సాయంత్రం ఏర్పాటైన ఆధ్యాత్మిక కార్యక్రమాలు అలరించాయి.

మళ్ల సురేంద్ర మిత్రమండలి సేవా కార్యక్రమాలు రేపు

అనకాపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర జన్మదినం సందర్భంగా సోమవారం పట్టణంలో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నామని సురేంద్ర మిత్రమండలి సభ్యులు తెలిపారు. ఎన్టీఆర్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలతో పాటు చీరలు పంపిణీ చేయనున్నట్టు వివరించారు. రైల్వే స్టేషన్, ఆసుపత్రి ఆవరణలోని అన్న క్యాంటీన్‌లో ఉచిత భోజనం, దుప్పట్లు పంపిణీతో పాటు మట్టి గణపతి విగ్రహాల పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.


స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రపై ప్రతిజ్ఞ చేస్తున్న దొన్నుదొర, ఎమ్మెల్యే మత్స్యలింగం, అధికారులు


డుంబ్రిగుడలో నిర్వహించిన మానహారంలో అధికారులు, విద్యార్థులు

ప్లాస్టిక్ నిషేధంతోనే పర్యావరణ పరిరక్షణ

» విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ దొన్నుదొర

» వాడవాడలా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీలు

అరకులోయ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణాన్ని పరిరక్షించాలని విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్, టీడీపీ అ రకు నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీవో లవరాజు ఆధ్వర్యంలో శనివారం జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే మత్స్యలింగం, దొన్నుదొర, సచివాలయ, ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ తదితర శాఖల అధికారుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో ఆఫీస్ నుంచి నాలుగురోడ్ల జంక్షన్‌వరకు ఈ ర్యాలీ సాగింది. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కాచి వడపోసిన నీటిని తాగాలన్నారు. ప్లాస్టిక్, పాలిథిన్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చునన్నారు. దోమలు వల్ల ప్రాణాంతక మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులు ప్రబలుతాయని హెచ్చరించారు. ఎంపీడీవో లవరాజు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంపై ఇప్పటికే పట్టణవాసులు, వ్యాపారులకు అవగాహన కల్పించామన్నారు. పాలిథిన్ కవర్లు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పర్యాటకులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా అవగాహనకల్పించాలని కోరారు. ఈ మేరకు ప్రతిజ్ఞ చేయించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఐటీడీఏ దుకాణ స ముదాయం ఎదుట చెత్తను ఊడ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బొరిబొరి లక్ష్మీ, మండల మహిళా నాయురాలు ద్రౌపతి, పెదలబుడు ఉపసర్పంచ్ చందూ విజయనిర్మల, పలువురు వార్డు మెంబర్లు, టీడీపీ నాయకులు , పీఆర్ డీఈఈ రా మం, ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి: ఎంపీడీవో

చింతపల్లి: గృహ పరిసరాలు, వీధులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానిక ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి అన్నారు. శనివారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాత బస్ స్టాండ్‌లో మానవహారం చేసి, ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వర్షాకాలం సీజనల్ వ్యాధులు సక్రమించకుండా ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తడి, పొడి చెత్త, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు గృహాలకు వచ్చే పంచాయతీ సిబ్బందికి అప్పగించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంఈవో పీవీవీవీ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ గడుతూరి స్వర్ణలత, ఏపీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రామేశ్వరం, సీనియర్ అసిస్టెంట్ ఎన్‌టీ రామారావు, కూటమి నాయకులు రీమల ఆనందరావు, కదుళ్లశ్రీను, సుర్ల వీరేంద్ర, గాజుల శ్రీను, మధు, వంతల బుజ్జిబాబు, సాగిన బాలకృష్ణ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు యువత కృషి చేయాలి

పాడేరురూరల్: పర్యావరణ పరిరక్షణకు యువత కృషి చేయాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టబ్బాయి కోరారు. కళాశాలలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షపు నీరు కళాశాల ప్రాంగణంలో నిల్వ ఉండకుండా కాలువలను ఏర్పాటు చేశారు. కళాశాల ప్రాంగణంలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. ప్లాస్టిక్ రహిత క్యాంపస్‌గా కళాశాలను తీర్చిదిద్దాలనికోరారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ టీఎన్. రసూల్, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కో-ఆర్డినేటర్ డాక్టర్. వి.రమేశ్‌బాబు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జానకీరామ్, జి.దామోదర్, డాక్టర్. గణేష్, జి.గౌరీశంకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం స్వచ్ఛాంధ్ర ర్యాలీ, అరకు-పాడేరు ప్రధాన రహదారి కూడలి మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ త్రివేణి, ఎంఈవో సుందర్రావు, అంగన్‌వాడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనంతగిరిలో..

అనంతగిరి: మండల కేంద్రంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమపై అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోని మండల ప్రత్యేకాధికారి ఎస్ఎస్‌ఏ పీవో స్వామినాయుడు, ఎంపీడీవో ప్రభాకర్, తహశీల్దార్ వీరభద్రచారి మాట్లాడుతూ.. ప్రతినెలా మూడో శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలోని ఎంఈవో బాలాజీ, బాలికల - 2 హెచ్ఎం మంగమ్మ, ఏపీవో సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.


పాడేరు డిగ్రీ కాలేజీలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధ్యాపకులు


అనంతగిరిలో..


చింతపల్లిలో ర్యాలీ

బ్రహ్మకుమారీస్ సేవలు అభినందనీయం: జేసీ



రక్తదాన శిబిరంలో మాట్లాడుతున్న జేసీ, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ అభిషేక్ గౌడ

పాడేరురూరల్, ఆగస్టు 23 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో బ్రహ్మకుమారీస్ (ఓంశాంతి)ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని జాయింట్ కలెక్టర్, రెడ్‌క్రాస్ సొసై టీ చైర్మన్ డాక్టర్. ఎంజే అభిషేక్ గౌడ అన్నారు. స్థానిక టీటీడీ కళ్యాణ మండలంలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర కళాకారుల సాంస్కృతిక శాఖ చైర్మన్ వి.గంగులయ్యతో కలిసి ఈ శిబిరా న్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్తదానంతో ఎంతో మంది ప్రాణాలు నిలపవచ్చునని అన్నారు. తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి రక్తదాన శిబిరాన్ని సందర్శించారు. ఈ శిబిరంలో 25 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్.రాఘవేంద్ర, రా ష్ట్ర రెడ్‌క్రాస్ సొసైటీ కార్యవర్గ సభ్యులు బొర్రా నాగరాజు, సొసైటీ వైస్ చైర్మన్ ఎస్.గంగరాజు, కార్యదర్శి జి.గౌరీశంకరరావు, కోశాధికారి పి.సూర్యారావు, కార్యవర్గ సభ్యులు సుబ్రహ్మణ్యం, రవి, ప్రసాద్ నాయుడు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఆశ పోస్టులను ఎంపిక చేయాలి

» ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్


పొద్దు బాలదేవ్

అరకులోయ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆశా కార్యకర్తల ఉద్యోగ నియామకాలను పారదర్శకంగా అర్హులైన వారికి కేటాయించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు. శనివారం గిరిజన్‌భవన్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడారు. జిల్లాలో 124 ఆశా కార్యకర్తల పోస్టులకు ఇటీవల ఇంటర్వ్యూలు, రాతపరిక్షలు నిర్వహించారన్నారు. ఈ నేపథ్యంలో కొంతమంది దళారులు ప్రవేశించి డబ్బు వసూలుకు సిద్ధమవుతున్నారన్నారు. ఆశ కార్యకర్త పోస్టుకు సర్పంచ్, ఆయా పరిధిలో ఉండే పీహెచ్‌సీ వైద్యాధికారి తో కూడిన కమిటీ దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులలో ముగ్గురు పేర్లను ఎంపిక చేసి ఉద్యోగ నియామకానికి సిఫార్సుచేశారన్నారు. వీరిలో అన్ని అర్హతలున్న ఒకరిని నియమించాల్సి ఉంది. డీఎంహెచ్‌వో ఆఫీసుకు పంపిన జాబితాను కొంతమంది దళారులు సంపాదించి ఒక్కో పోస్టుకు రూ. లక్ష డిమాండ్ చేస్తున్న బాలదేవ్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని పారదర్శకంగా అర్హులైన వారిని ఎంపిక చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

విజయవంతంగా క్లైమేట్ యాక్షన్ క్యాంపెయిన్


డిగ్రీకళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, రెడ్‌క్రాస్ విద్యార్థులు

పాడేరురూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ సహకారంతో శనివారం ఆంధ్ర ప్రదేశ్ క్లైమేట్ యాక్షన్ క్యాంపెయిన్‌ను నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టబ్బాయి తెలిపారు. రాష్ట్రంలో 169 ప్రభుత్వ డిగ్రీకళాశాలలుండగా అందులో 26 కళాశాలలు మా త్ర మే ఎంపిక చేశారని, వీటిలో తమ కళాశాల ఒకటన్నారు. కళాశాలలోని 100 మంది విద్యార్థులను యూత్ రెడ్‌క్రాస్‌కు క్లైమేట్ యాక్షన్ వలంటీర్లుగా ఎంపిక చేశామన్నారు. ఒక్కో వలంటీర్ 10 గృహాలను దత్తత తీసుకున్నారన్నారు. ప్రజల్లో పర్యావరణ చైతన్యం, వాతావరణ మార్పులపై అవగాహన కల్పిస్తారన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్.టీఎన్.రసూల్, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కో-ఆర్డినేటర్ డాక్టర్.వి.రమేశ్‌బాబు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జానకీరామ్, క్లైమేట్ వలంటీర్లు, పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం: డీఎల్‌పీవో


ముంచంగిపుట్టులో వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ముంచంగిపుట్టు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలా పాడేరు డీఎల్‌పీవో పి.కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో వర్షా కాలంలో జాగ్రత్తలపై కళాకారుల బృందంతో అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. దోమల నివారణకు చర్యలు, ప్లాస్టిక్ కవర్ల నిషేధం, ఆహారపు అలవాట్లు, వ్యక్తి గత, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యానారాయణమూర్తి, పంచాయతీ కార్యదర్శులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్స్ నూతన కార్యవర్గం

ముంచంగిపుట్టు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ నూతన మండల కమిటీ ఎన్నిక శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా జరిగింది. మండల కమిటీ నూతన అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారిగా వి.గంగాభవాని, ఎస్.ఈశ్వరి, కె.అమ్మాజీలు ఏకగ్రీవంగా నియమితులయ్యారు. గౌరవ అధ్యక్షులుగా బి.సత్యవతి, కె.మౌలమ్మ, ఉపాధ్యక్ష, సహాయ కార్యదర్శులుగా ఆర్.భవాని, చంద్రకళ, వి.దేవి, కె.మంగ్లీలతో పాటు పలువురు సభ్యులను నియమించినట్టు సీఐటీయూ మండల కార్యదర్శి కె.శంకరరావు తెలిపారు.

రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన


సీతగుంటలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

పెదబయలు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వంలో గిరిజన ప్రాంతంలో మౌలిక సదుపాయాలు మెరుగుపడుతున్నాయనిసీతగుంట సర్పంచ్ పలాసి మాధవరావు, ఎంపీ టీసీ సభ్యుడు కిమంకరి బొంజుబాబు తెలిపారు. శనివారం పంచాయతీ పరిధిలో గురుకుల పాఠశాల, కళాశాలకు వెళ్లే మార్గంలో సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడు తూ కలెక్టర్ నిధులు రూ. 58 లక్షలతో ఈ రోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఆర్ జేఈ శివరామయ్య, కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కొండయ్య, ఉప సర్పంచ్ గంగాధరం తదితరులు పాల్గొన్నారు. గలంగండ పంచాయతీ మంగబంధ గ్రామంలో జడ్పీ నిధులు రూ. 3 లక్షలతో 75 మీటర్ల సీసీరోడ్డు, డ్రైనేజీ పనులను జడ్పీటీసీ సభ్యుడు కూడా బొంజుబాబు శంకుస్థాపన చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు బొండా వరహాలమ్మ, స్థానిక సర్పంచ్ లోహిదాసు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పెసా ఎన్నికలు


కోర్రాలో ఎన్నికయిన సభ్యులు

డుంబ్రిగుడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిలిచిన పెసా కమిటీల ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయినట్లు స్థానిక ఎంపీడీవో ప్రేమ్ సాగర్ తెలిపారు. శనివారం కోర్రా, పోతంగి, కించుమండ తదితర గ్రామాల్లో ఈ ఎన్నికలు నిర్వహించారు. కించుమండలో కొన్ని కారణాలతో వాయిదాపడింది. వివాదాలకు తావులేకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఎన్నికయిన కమిటీ సభ్యులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈనెల 25న వాయిదా పడినసాగర, అరమ, కోర్రాయి, గసబ, తూటంగి, కితలంగి పంచాయతీల్లో ఎన్నికలను నిర్వహించనున్నామని ఎంపీడీవో చెప్పారు.

టీడీపీ లీగల్ అడ్వైయిజరీ పదవి నుంచి రత్నరాజు తొలగింపు

అరకులోయ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అరకు అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ లీగల్ అడ్వైయిజర్‌గా ఉన్న న్యాయవాది రత్నరాజును ఆ పదవి నుంచి తొలగిస్తున్నట్టు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని యండపల్లివలసలో చర్చి, చర్చి పాస్టర్ యేసుపా దం ఇంటిపై కొందరు దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే.దీనిపై యేసుపాదం, చర్చి సభ్యులు, అరకులోయ పాస్టర్స్ ఫెలోషిప్, క్రైస్తవ ఐక్యవేదిక సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ చర్చి, పాస్టర్ ఇంటి స్థలం కేసుకు సంబంధించిన విషయంలో పలువురిని న్యాయవాది రత్నరాజు ప్రోత్సహిస్తున్నట్టు బాధిత పాస్టర్, క్రైస్తవ సంఘాలు దొన్నుదొర దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో దొన్నుదొర స్పందిస్తూ రత్నరాజు చర్చి స్థలాలనుంచి ఖాళీ చేయాలని ప్రయత్నించడం దారుణమన్నారు. పార్టీ ప్రతిష్టతకు ఎవరు భంగం కలిగిస్తున్న న్యాయవాదిని పార్టీ లీగల్ అడ్వైయిజర్ పదవినుంచి తొలగిస్తున్నట్టు చెప్పారు.

వ్యాన్ బోల్తా.. రాకపోకలకు అంతరాయం


డముకు సమీపంలో బోల్తాపడిన బొలేరో వాహనం

అనంతగిరి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అరకు-విశాఖ ప్రధాన రహదారిలోని డముకు సమీపాన మలుపువద్ద శనివారం సాయంత్రం వ్యాన్ వాహనం అదుపుతప్పి బోల్తాపడింది.. దీంతో రాకపోకలకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. అరకు వైపు నుంచి మైదాన ప్రాంతానికి పిల్లరు వేసే కాంక్రీట్ బాక్స్‌లను తరలిస్తున్న బొలేరో వాహనం డముకు సమీపంలో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. బస్సులు, లారీలకు అంతరాయం నెలకొంది.

'పెదవలసను మండలంగా ప్రకటించాలి'


మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ ఆనంద్, ప్రజాప్రతినిధులు

గూడెంకొత్తవీధి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెదవలసను మండలంగా ప్రభుత్వం ప్రకటించాలని టీడీపీ నాయకుడు, వైస్ ఎంపీపీ సప్పగెడ్డ ఆనంద్ విజ్ఞప్తి చేశారు. శనివారం పెదవలసలో ఐదు పంచాయతీల ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదవలస, లక్కవరపుపేట, దేవరాపల్లి, సంకాడ, రింతాడ పంచాయతీలను కలుపుతూ పెదవలస మండలంగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కృష్ణవంశీ, పెసా కమిటీ ఉపాధ్యక్షుడు కంకిపాటి గిరిబాబు, టీడీపీ నేత పంద్ర నూకరాజు, నాయకులు మోహన్ గాంధీ, త్రిమూర్తులు, తిమోతి, జైరాం పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ బాధితులకు పరిహారం చెల్లింపునకు చర్యలు

గూడెంకొత్తవీధి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 516-ఈ నిర్మాణంలో ఆర్‌వోఎఫ్ఆర్ భూములు కోల్పోతున్న బాధిత గిరిజన రైతులకు పరిహారం చెల్లింపునకు చర్యలు తీసుకుంటున్నట్టు స్థానిక తహసీల్దార్ అన్నాజీరావు అన్నారు. శనివారం పెదవలస గ్రామ సచివాలయంలో బాధిత గిరిజనులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌వోఎఫ్ఆర్ భూముల్లో జాతీయ రహదారి నిర్మాణానికి బాధిత గిరిజనులు సహకరించాలన్నారు.ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ సప్పగెడ్డ ఆనందరావు, సర్పంచ్ కృష్ణవంశీ పాల్గొన్నారు.

పేదల సాధికారతే పీ4 లక్ష్యం

» ఎస్ఎస్ఏ పీవో స్వామినాయుడు



మాట్లాడుతున్న ఎస్ఎస్ఏ పీవో స్వామినాయుడు

అనంతగిరి, ఆగస్టు 23 (ఆంధ్రజోతి): అట్టడుగున ఉన్న నిరుపేదలు సాధికారత సాధించాలనే లక్ష్యంతో పీ 4 కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని మండల ప్రత్యేకాధికారి, ఎస్ఎస్ఏ పీవో స్వామినాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం మండలస్థాయి అధికారులతో ఈ మేరకు సమావేశమై చర్చించారు. పేదరికం లేని సమాజం దిశగా మార్గదర్శి - బంగారు కుటుంబం నినాదంతో పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో భాగంగా నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకుని, అభివృద్ధికి పాటుపడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్, తహశీల్దార్ వీరభద్రచారి, తదితరులు పాల్గొన్నారు.

దానిరంగిణిలో తాగునీటి సమస్యపై వినతి


ఉద్యోగికి వినతిపత్రమిస్తున్న మహిళా సంఘం ప్రతినిధులు

అరకులోయ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాడగడ గ్రామ పంచాయతీ పరిధి దానిరంగిణి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆదివాసీ మహిళా గిరిజన సంఘం నేతలు కోరారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈ మేరకు ఫిర్యాదు చేశారు. గిరిజన మహిళాసంఘం జిల్లా కార్యదర్శి వి.విజయ , మండల కార్యదర్శి కిల్లో శశికళ సభ్యులు మాట్లాడుతూ, దానిరంగిణి గ్రామంలో తాగునీటి పథకం పూర్తి చేయలేదన్నారు. అలాగే, ఆ గ్రామస్థులు సీపీఎం ప్రతినిధులు ఆధ్వర్యంలో బస్కీకి వెళ్లే ప్రధాన రహదారి నుంచి దానిరంగిణికి సుమారు 190 మీటర్ల మేర సీసీరోడ్డు, మురుగుకాల్వ నిర్మించాలని కోరారు. గ్రామంలో ఉన్న బోరుబావికి మోటారు ఏర్పాటుచేసి తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. సీపీఎం నాయకులు సత్యారావు, దామోదర్, మహదేవ్, రాములమ్మ, సుశీల, ధనుమతి, మోతురదేవి, కమల, డొమిని, సోయిత, బాబూరావు,గోవర్ధన్, గోవింద్, గోపి, బూపెన్, చందు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల వసతి గృహం మరమ్మతులకు రూ.3.2 లక్షలు

వచ్చే నెలలో పనులు ప్రారంభం


చింతపల్లి గర్భిణుల వసతి గృహం

చింతపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సబ్ డివిజన్ కేంద్రంలోనున్న గర్భిణుల వసతి గృహం మరమ్మతులకు రూ.3.2లక్షలు విడుదల చేస్తూ ఐటీడీఏ పీవో డాక్టర్ అభిషేక్ గౌడ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ స్థితిలో వచ్చే నెల పనులు ప్రారంభించనునున్నట్టు గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. గతంలో 'ఆంధ్రజ్యోతి'లో 'సమస్యల్లో గర్భిణుల వసతి గృహం' శీర్షికన కథనం ప్రచురించింది. ఈ వసతి గృహం మరమ్మతులకు గిరిజన సంక్షేమశాఖ పాడేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐటీడీఏకు రూ. 3.2లక్షల నిధులు అవసరమని ప్రతిపాదనలు పంపించారు. ఈ ఏడాది జూలై 28న నిధులు విడుదలపై పీవో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులు ఈనెల 20న అందుబాటులోకి వచ్చాయి. గిరిజన ప్రాంతంలో డోలీ మోతలను నియంత్రణకు ప్రభుత్వం ఏరియా ఆస్పత్రులు, పీహెచ్‌సీలకు అనుబంధంగా గర్భిణుల వసతి గృహం ఏర్పాటు చేసింది. ఇక్కడి సంతబయలు వద్దనున్న కల్యాణమండపాన్ని వసతి గృహంగా తీర్చిదిద్దారు. 20 మంది గర్భిణులు బస చేసేందుకు అ నువుగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం ప్రతి రోజు 10-15మంది గర్భిణులు ప్రసవాల కోసం నిరీక్షిస్తున్నారు. అయితే, గత వైసీపీ ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోలేదు. దీంతో వసతి గృహంలో మరమ్మతులకు గురైంది. పైకప్పు పగిలిపోయి వర్షాలకు కారిపోతున్నది. మరుగుదొడ్ల డోర్లు, ఫ్యాన్లు పాడైపోయాయి, ఆర్‌వో ప్లాంట్ సైతం మూలనపడింది. ఈ స్థితిలో ఎట్టకేలకు ఐ టీడీఏ అధికారులు నిధులు విడుదల చేయడంతో నెల రోజుల్లో గర్భిణులకు మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి.

పంప్డ్ స్టోరేజీ డంపింగ్ యార్డు ఏర్పాటుకు స్థల పరిశీలన


స్థలం పరిశీలనలో జెన్‌కో, అటవీశాఖ అధికారులు

సీలేరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పంప్డ్ స్టోరేజీ డంపింగ్ యార్డు ఏర్పాటుకు జెన్‌కో, అటవీ శాఖ ఉన్నతాధికారులు స్థల పరిశీలన చేపట్టారు. శనివారం ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్(సివిల్) రవీంద్రరెడ్డి, అటవీశాఖ రేంజ్ అధికారి వెంకటరావు పర్యవేక్షణలో అధికారుల బృందం జెన్‌కో స్థలాల్లో పర్యటించారు. తొలుత పంప్డ్ స్టోరేజీ డంపింగ్ యార్డును దుప్పిలవాడ పంచాయతీ జొన్నమామిడి అటవీశాఖ స్థలాన్ని ఎంపిక చేశారు. అధికారులు అటవీశాఖ అనుమతి కోరారు. అయితే డంపింగ్ యార్డు ఏర్పాటుకి జెన్‌కో స్థలం తీసుకోవాలని అటవీశాఖ సూచించింది. దీంతో మరోసారి అటవీశాఖ, జెన్‌కో అధికారులు సంయుక్తంగా జెన్‌కో స్థలాలను పరిశీలించారు. డపింగ్ యార్డు ఏర్పాటుకి అనువైన స్థలాల వివరాలతో జెన్‌కో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించనున్నారు. కార్యక్రమంలో ఎస్ఈలు చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఈఈభాస్కరరావు, ఏడీ అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఆర్ఐటీఐలో సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

చింతపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ఐటీఐలో ఖాళీ సీట్లు భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎ. రమణ తెలిపారు. ఐటీఐలో మిగులు సీట్లు భర్తీ చేసేందుకు మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నామన్నారు. వివిధ ట్రేడ్లలో ప్రవేశాలు ఆశించే విద్యార్థులు ఈ నెల 26తేదీలోగా ఐటీఐ వెబ్ సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 27న ధ్రువపత్రాలు పరిశీలన, 29తేదీన ఐటీఐలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.

గోమంగిని మండలంగా ప్రకటించాలని ర్యాలీ



సంతలో ర్యాలీ నిర్వహిస్తున్న మండల సాధన కమిటీ ప్రతినిధులు

పెదబయలు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోమంగిని ప్రత్యేక మండలంగా ప్రకటించాలని గోమంగి సాధన సమితి సభ్యులు డిమాండ్ చే శారు. శనివారం గోమంగి వారపు సంతలో స్థానిక సర్పంచ్ సత్తిబాబు ఆధ్వర్యంలో పలు పంచాయతీ ప్రజలతో కలసి భారీ ర్యాలీ చేపట్టారు. సంతలో గిరిజనులకు చైతన్య పరిచారు. ఈ కార్యక్రమంలో గోమంగి సాధన సమితి నాయకులు కొమ్మ అనంతపద్మనాభం, సునీల్, మేఘరాజు, రాంబాబు, కృష్ణబాబు, మహేష్, మధు, పాల్గొన్నారు.

డ్రగ్స్, గంజాయితో భవిష్యత్తు నాశనం


విద్యార్థులో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

సీలేరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్, గంజాయికి దూ రంగా ఉండాలని తూ ర్పు గోదావరి ఈగల్ బృందం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వీవీ సూర్య మోహనరావు అన్నారు. శనివా రం జెన్‌కో కల్యాణ మండపంలో ఈగల్ బృందం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూడ్రగ్స్, గంజాయికి అలవాటు పడితే విలువైన జీవితాలు నాశనమవుయన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ నారాయణరావు, ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ రాజేంద్ర ప్రసాద్, అటవీశాఖ రేంజ్ అధికారి వెంకటరావు పాల్గొన్నారు.


సీఎం రిలీఫ్ చెక్కును అందిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

కృష్ణాదేవిపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని ఏఎల్ పురం గ్రామానికి చెందిన పోతల అప్పలనాయుడు వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కును స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శనివారం పంపిణీ చేశారు. అప్పల నాయుడు ఆరోగ్య సమస్యను జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్ స్పీకర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సీఎం రిలీఫ్ నిధి నుంచి రూ.లక్ష మంజూరయ్యేలా స్పీకర్ కృషి చేశారు. ఈ చెక్కును అప్పలనాయుడుకు స్పీకర్ అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, టీడీపీ నాయకులు బొడ్డు జమీలు, పెట్ల నారాయణమూర్తి, స్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వడ్డాదిలో మరొకరికి...

బుచ్చెయ్యపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది గ్రామానికి చెందిన వర్రి హర్షవర్ధన్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కును రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు శనివారం అందజేశారు. హర్షవర్ధన్ అనారోగ్య సమస్యతో బాధపడుతున్న విషయాన్ని తాతయ్యబాబు తెలుసుకుని, వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.లక్ష సహాయం మంజూరయ్యేలా కృషి చేశారు. ఈ చెక్కును శనివారం ఆయన అందజేశారు. ఈ కార్యక్రమమలో టీడీపీ వడ్డాది దొండా నరేశ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆడారి ఆనంద్‌కు డెయిరీ డైరెక్టర్ అభినందన


ఆనందకుమార్‌ను సత్కరిస్తున్న డెయిరీ డైరెక్టర్ దాడి పవన్‌కుమార్

చోడవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన ఆడారి ఆనంద్‌కుమార్‌ను శనివారం స్థానిక విశాఖ డెయిరీ డైరెక్టర్ దాడి పవన్‌కుమార్‌తో పాటు సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు. సంస్థ చైర్మన్ ఆనంద్‌కుమార్ మరిన్ని ఉన్నత పదవులు నిర్వహించి విజయం సాధించాలని ఈ సందర్భంగా డైరెక్టర్, సిబ్బంది కోరారు. అనంతరం ఆనంద్‌కు పూలమాలలు వేసి శుభాకాంక్షలు చెప్పారు.

ఆనంద్‌ను కలిసిన గేదల సత్యనారాయణ

బుచ్చెయ్యపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన ఆడారి ఆనంద్‌కుమార్‌ను విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదల సత్యనారాయణ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. బీజేపీలో మంచి గుర్తింపు తెచ్చుకుని సముచిత స్థానం సంపాదించాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.

సమస్యల పరిష్కారానికి ప్రజావేదిక


భూ సమస్యలపై ఇరు వర్గాలతో మాట్లాడుతున్న అధికారులు

గొలుగొండ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సమస్యలపై శనివారం ప్రజావేదిక నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి రమణ మూర్తి, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎస్ఐ రామారావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కొంగశింగి, పాకలపాడు, తదితర గ్రామాల నుంచి వచ్చిన ఇరు వర్గాల భూ సమస్యలపై వారు విచారణ చేపట్టారు. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్టు ఈ సందర్భంగా ఎస్ఐ తెలిపారు. ప్రజా వేదికను ప్రజలు అందరూ సద్వినియోగపర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


రావికమతంలోమానవహారంగా ఏర్పడిన అధికారులు, విద్యార్థులు

రావికమతం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని మండల ప్రత్యేకాధికారి వసంతరావు చెప్పారు. మండల కేంద్రంలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో అధికారులు, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రతకు గృహిణులు, వ్యాపారులు, ఉద్యోగులు, రైతులు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అంబేడ్కర్, ఎంపీడీవో సీతారామస్వామి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిశుభ్రతలో ముఖ్య పాత్ర పోషించాలి


మహిళలతో మాట్లాడుతున్న ఎంపీడీవో హేమసుందరరావు

చీడికాడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతలో మహిళలు ముఖ్య పాత్ర పోషించాలని ఎంపీడీవో హేమసుందరరావు సూచించారు. స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చీడికాడ, జైతవరం గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కాలువలు, మరుగుదొడ్లను పరిశీలించారు. అలాగే అన్ని గ్రామ పంచాయతీల్లో ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. అనంతరం చీడికాడలో మహిళలతో ప్రత్యేకంగా మాట్లాడారు. స్వచ్ఛభారత్‌లో చీడికాడ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దాలని, ఇందుకు మహిళలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఎ.సన్యాసిరావు, ఎస్.సింహాచలంనాయుడు, పీలా పద్మావతి, ఎ.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో రైతులను ఇబ్బంది పెట్టొద్దు

▸ మండల ప్రత్యేకాధికారి పూర్ణిమాదేవి

కె.కోటపాడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వరి నాట్లు వేసుకున్న రైతులకు యూరియా సరఫరాలో ఇబ్బందులు పెట్టొద్దని మండల ప్రత్యేకాధికారి పూర్ణిమాదేవి ఆదేశించారు. మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో శనివారం ఆమె తనిఖీలు చేశారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎరువుల సరఫరాలో జాగ్రత్తగా పాటించాలని యజమానులకు సూచించారు. అంతకు ముందు అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రత్యేకాధికారి పూర్ణిమాదేవి మాట్లాడుతూ మండలంలో యూరియా సరఫరా ఎంతవరకు అవసరమవుతుందో చూడాలని సూచించారు. అలాగే ఎరువులు దుకాణాల్లో ఎక్కడైనా ఎంఆర్‌పీకి మించి అధికంగా విక్రయిస్తే వెంటనే చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ భుజంగరావు, ఎంపీడీవో సాంబశివరావు, మండల వ్యవసాయాధికారి సోమశేఖర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


ఎరువుల దుకాణాల్లో రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

చోడవరం దుకాణాల్లో తనిఖీలు

చోడవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణాల్లో శనివారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, ఎరువుల నిల్వల వివరాలను పరిశీలించడంతో పాటు ఎరువుల విక్రయాలకు సంబంధించి ఆరా తీశారు. దుకాణాల్లో అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏడీ వి.రవీంద్రనాథ్ హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పావని, వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.

రావికమతంలో...

రావికమతం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట ఎరువుల దుకాణంలో వ్యవసాధికారి రమేశ్ శనివారం తనిఖీలు చేశారు. స్టాక్ వివరాలను పరిశీలించారు. ఎరువులను, క్రిమిసంహారక మందులను ఎమ్మార్పీకే విక్రయించాలని యజమానులకు ఆదేశించారు. అలాగే ఎరువులు కొన్న రైతులకు రశీదు ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతానికి ఎరువుల కొరత లేదని ఆయన చెప్పారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు చేపట్టండి

▸ మండల ప్రత్యేకాధికారి రమణమూర్తి

గొలుగొండ/కృష్ణాదేవిపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల కొరత లేకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి రమణమూర్తి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సచివాలయ ఉద్యోగులు, వ్యవసాయ శాఖ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో అన్ని రకాల ఎరువులు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయాధికారిణి సుధారాణి పాల్గొన్నారు.

అలాగే ఏఎల్ పురం, చోద్యం తదితర గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను తహశీల్దార్ శ్రీనివాసరావు, నర్సీపట్నం డీఎల్‌పీవో సత్యనారాయణ, ఏవో సుధారాణిలతో కూడిన బృందం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ ఎమ్మార్పీకి మించి ఎరువులు విక్రయిస్తే వ్యాపారులపై చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, వీఆర్వో రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రమణమూర్తి

ఎమ్మార్పీకి మించి ఎరువులు అమ్మితే చర్యలు

మాకవరపాలెం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నిర్దేశిత ధరకు మించి ఎరువులను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేకాధికారి మోహన్‌రావు హెచ్చరించారు. మండలంలోని ఎరువుల దుకాణాలను శనివారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ దుకాణ యజమానులు యూరియా నిల్వ చేయడం, అధిక ధరలకు అమ్మడం చేస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. దుకాణాల ముందు ఎరువుల నిల్వలు, ధరల పట్టికను ఉంచాలని సూచించారు. అలాగే యూరియా ఉండి కూడా విక్రయించకపోయినా, ఎరువులు పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించినా కఠిన చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహశీలార్ వెంకటరమణ, ఎంపీడీవో మేరీ జోన్స్, మండల వ్యవసాయ అధికారి అప్పారావు, ఎస్ఐ దామోదర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీలో రావికమతం యువత సత్తా

▸ మండలంలో 25 మందికి మంచి ర్యాంకులు


పిల్లా ధనలక్ష్మి

రావికమతం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వారంతా గ్రామీణ ప్రాంతానికి చెందిన సామాన్య రైతు బిడ్డలు. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. తాము పడే కష్టాలు బిడ్డలు పడకూడదనే లక్ష్యంతో పిల్లలను ఉన్నతంగా చదివించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్న వారంతా టీటీసీ, బీఈడీ తదితర కోర్సులు పూర్తిచేసి, ఇప్పుడు ఉపాధ్యాయ కొలువుల కోసం కష్టబడ్డారు. మొక్కవోని దీక్షతో చదివి డీఎస్సీ పరీక్ష రాసి మంచి ర్యాంకులు సాధించారు. తద్వారా వారి తల్లిదండ్రుల ఆశయాన్ని నెరవేర్చారు.

రావికమతం మండలంలోని కొత్తకోట గ్రామానికి చెందిన తొమ్మిది మంది, టి.అర్జాపురానికి చెందిన ఆరుగురు, దొండపూడి, మేడివాడ, రావికమతం, కన్నంపేట, చినపాచిల తదితర గ్రామాలకు చెందిన యువతీ, యువకులు ఉపాధ్యా ఉద్యోగాల కోసం మంచి ర్యాంకులు సాధించారు. కొత్తకోటకు చెందిన విరోతి ఆనంద్ ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) 90.5 మార్కులతో జిల్లాలో మొదటి స్థానం సాధించారు. మేడివాడకు చెందిన గొర్లె శివరామకృష్ణ జిల్లాలో పీడీ (స్కూల్ అసిస్టెంట్) నాలువ ర్యాంకు, పీఈటీ ఫస్ట్ ర్యాంకులు సాధించారు. చినపాచిలకు చెందిన కె.ప్రకాశ్ (స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీషు) జిల్లా సెకండ్ ర్యాంకు సాధించారు. అలాగే టి.అర్జాపురం గ్రామానికి చెందిన సీతిన జోగినాయుడు (స్కూల్ అసిస్టెంట్ సోషల్), కోలా సత్తిబాబు (ఎస్‌జీటీ), మడగల సత్యవేణి (ఎస్‌జీటీ), పిల్లా ధనలక్ష్మి (ఎస్‌జీటీ), మలిశెట్ల కుసుమ (ఎస్‌జీటీ), గంధం మహేశ్ (ఎస్‌జీటీ), దొండపూడికి చెందిన తోట స్వాతి ఉపాధ్యాయ ఉద్యోగ అర్హత సాధించారు. మేడివాడకు చెందిన గేడి లోవరాజు ఎస్ఏ సోషల్ ఏడో ర్యాంకు కొట్టారు. వారిని తల్లిదండ్రులు, గ్రామస్థులు అభినందించారు.

గ్రామాల్లో 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'

దేవరాపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్.గజపతినగరం, రైవాడ, తామరబ్బ, బి.కింతాడ గ్రామాల్లో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి మంజులావాణి, ఎంపీడీవో సువర్ణరాజు విద్యార్థులు, ఉద్యోగులతో ర్యాలీ చేశారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మరొకరి పరిస్థితి విషమం


ప్రమాదంలో మృతి చెందిన రామునాయుడు

చోడవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకన్నపాలెం జంక్షన్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ముద్దుర్తి కొత్తపల్లి గ్రామానికి చెందిన ఏజుడ రామునాయుడు (42), నంబారు సోమునాయుడు శనివారం రాత్రి తమ గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై వెంకన్నపాలెం వస్తుండగా, అదే గ్రామానికి చెందిన వ్యాన్ వారిని ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న రామునాయుడు సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. వెనుక కూర్చొన్న నంబారు సోమునాయుడుకు రెండు కాళ్లు విరిగిపోవడంతో పాటు తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన్ను అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఎస్ఐ జోగారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలపై విచారిస్తున్నారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్టు


పోలీసుల అదుపులో ఉన్న జూదరులు

రావికమతం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో కవ్వగుంట పంచాయతీ శివారు బుడ్డిబంద జీడిమామిడి తోటల్లో పేకాడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు రావికమత ఎస్ఐ ఎం.రఘువర్మ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బుడ్డిబంద జీడిమామిడి తోటల్లో కొండ పక్కన పేకాడుతున్నరని ముందస్తు సమాచారం మేరకు శనివారం సిబ్బందితో వెళ్లి ఎస్ఐ దాడులు చేశారు. ఈ సమయంలో ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి నుంచి ద్విచక్ర వాహనం, రూ.5,400 నగదు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు


నర్సీపట్నంలోని ఓ ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

నర్సీపట్నం అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. విశాఖ విజిలెన్స్ ఎస్సై రవితేజ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. ఈ సందర్భంగా దుకాణాల్లో ఎరువుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. ఎంత మేరకు నిల్వలు ఉన్నాయి, ఎంత ధరకు అమ్ముతున్నారు, తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉషశ్రీ, మండల వ్యవసాయాధికారిణి విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోండి

ఆర్డీవోకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు వినతి


ఆర్డీవోకు సమస్యలు వివరిస్తున్న జనసేన ఇన్‌చార్జి రాజు

రోలుగుంట/మాకవరపాలెం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న మైనింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు కోరారు. ఈ మేరకు శనివారం ఆర్డీవో వీవీ రమణను కలిసి విన్నవించారు. అనుమతులు లేకుండా, ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా చాలా క్వారీల్లో అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారన్నారు. స్థానిక అధికారులు కూడా ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఆర్డీవో స్పందిస్తూ అక్రమ క్వారీ యజమానులకు నోటీసులు పంపుతామని, విచారణ చేపట్టి తదుగుణంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు జనసేన ఇన్‌చార్జి రాజు తెలిపారు.

స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కావాలి

▸ నర్సీపట్నం సబ్ డీఎఫ్‌వో సునీల్‌కుమార్


డ్రిల్ చేస్తున్న అటవీ శాఖాధికారులు, సిబ్బంది

కృష్ణాదేవిపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్రలో అంతా భాగస్వాములు కావాలని నర్సీపట్నం సబ్ డీఎఫ్‌వో సునీల్‌కుమార్ కోరారు. గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేట అటవీ కార్యాలయంలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలు పరిశుభ్రతం చేశారు. అనంతరం అటవీ అధికారులు, సిబ్బందితో డ్రిల్ చేయించారు. అనంతరం సబ్ డీఎఫ్‌వో మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో అంతా భాగస్వాములు కావాలన్నారు. కృష్ణాదేవిపేట అటవీ రేంజ్ అధికారి కె.శ్రీనివాసరావు, డీఆర్‌వో సత్యనారాయణ, సెక్షన్ అధికారి రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్‌తో గంజాయి రవాణా మార్గాల గుర్తింపు

రావికమతం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో కల్యాణపులోవ పరిసరాల నుంచి గంజాయి రవాణా మార్గాలను గుర్తించేందుకు కొత్తకోట పోలీసులు శనివారం డ్రోన్ సర్వే నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంత గ్రామాల నుంచి అటవీ మార్గంలో కాలిబాటల ద్వారా గంజాయి రవాణా జరగకుండా ఈ కార్యక్రమం చేపట్టారు. ఇటీవల కాలంలో ఈ ప్రాంతం నుంచి గంజాయి రవాణా చేస్తూ పలువురు పోలీసులకు పట్టుబడిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గంజాయిని కాలిబాట ద్వారా చేసే రవాణా మార్గాలను గుర్తించి, అరికట్టేందుకు కొత్తకోట ఎస్ఐ ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా డ్రోన్ కెమెరా ద్వారా కాలిబాటల ద్వారా గంజాయి రవాణా చేసే మార్గాలను గుర్తించి నియంత్రిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

26న మెగా జాబ్‌మేళా

నర్సీపట్నం అర్బన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 26న 15 కంపెనీలతో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి గోవిందరావు తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు పదో తరగతి, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ చదువుకుని, 18 నుంచి 35 ఏళ్ల యువతీ, యువకులు అర్హులన్నారు. ఆసక్తి గలవారు నైపుణ్యం వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా పేర్లు నమోదు చేసుకుని హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 90147 65287, 900009227 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చోడవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): చోడవరం సబ్ స్టేషన్ పరిధిలోని అన్నవరం ఫీడర్ 11 కేవీ లైన్ల నిర్వహణ పనుల దృష్ట్యా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ లైన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. మండలంలోని లక్ష్మీపురం, లక్ష్మీగార్డెన్స్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు. ఈ అంతరాయాన్ని వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పోరాట యోధుడు 'సురవరం'

చోడవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కార్మిక కర్షక బడుగువర్గాల సమస్యలపై అవిశ్రాంతంగా పోరాటాలు సాగించిన యోధుడు సురవరం సుధాకరరెడ్డి అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు పేర్కొన్నారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సువరం ఎందరికో స్ఫూర్తి ప్రదాత అని ఈ సందర్భంగా అప్పలరాజు చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆబోతుల శ్రీనివాసరావు, పుల్లేటి అప్పారావు, కాకి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ జాతర

మాకవరపాలెం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో రాజుపేట గ్రామంలో పోలేరమ్మ జాతరను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే భజనలు, చిడతల నృత్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్న సమారాధన ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్టు సర్పంచ్ అల్లు రామునాయుడు చెప్పారు.

వినాయక మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి

రోలుగుంట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వినాయక మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ రామకృష్ణారావు స్పష్టం చేశారు. ఉత్సవ కమిటీలు ముందస్తుగా ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకోవాలని కోరారు. అలాగే మండపం ఏర్పాటు చేసినప్పుడు ట్రాఫిక్‌కు అంతరాయం, వీధి రోడ్లపై ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విగ్రహం ఏర్పాటు చేసినప్పుడు కమిటీ సభ్యులు పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఎటు వంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా కమిటీ సభ్యులు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు.

మట్టి వినాయకులనే పూజించాలి

మాకవరపాలెం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం భక్తులు మట్టి వినాయకులనే పూజించాలని తూటిపాల ప్రధానోపాధ్యాయుడు రాము కోరారు. ఈ మేరకు గ్రామంలో విద్యార్థులతో పాటు ప్రచారం నిర్వహించారు. అలాగే మట్టితో తయారు చేసిన స్వామివారి బొమ్మలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూమట్టి వినాయకుల బొమ్మలనే వాడలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాబూరావు



గొలుగొండ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాబూరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో మేరీరోజీని నర్సీపట్నం డీఎల్‌పీవో కార్యాలయానికి బదిలీ చేశారు. అక్కడ ఈవోపీఆర్‌డీవోగా పనిచేస్తున్న బాబూరావుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

కృష్ణాదేవిపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కృష్ణాదేవిపేట పోలీసు స్టేషన్లలో ఎస్ఐ వై.తారకేశ్వరరావు శనివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వివిధ కేసుల్లో ఉన్న వారిని పిలిచి సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. గంజాయి రవాణాలో పాల్గొంటే పీడీ యాక్ట్ కింద కఠినంగా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్ఐ హెచ్చరించారు.

హోమియో వైద్యశాలకు స్థల పరిశీలన

కృష్ణాదేవిపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కృష్ణాదేవిపేటలో హోమియో వైద్యశాల నిర్మాణానికి తహశీల్దార్ కె.శ్రీనివాసరావు శనివారం స్థల పరిశీలన చేశారు. ప్రస్తుతం హోమియో వైద్యశాల ఉన్న శిధిల కమ్యూనిటీ భవనాన్ని తొలగించి, కొత్త భవనం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఇక్కడ అనువైన స్థలాన్ని గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిస్తానన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్, టీడీపీ నాయకులు బోడ్డు జమీలు, స్వామినాయుడు, రాజులనాయుడు, లగుడు రాజు, రమేశ్, అప్పలనాయుడు, వీఆర్‌వోలు రాజు, పడాల్ పాల్గొన్నారు.

వడ్డాదిలో బస్ షెల్టర్ ప్రారంభం

బుచ్చెయ్యపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో వడ్డాది గ్రామంలో శనివారం బస్ షెల్టర్ ప్రారంభించారు. జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు తన సొంత నిధులు రూ.3.5 లక్షలతో బాటసారులు, రైతుల సౌకర్యార్థం కస్పా పొలాల్లో ఈ షెల్టర్‌ను నిర్మించారు. వర్షాలకు, ఎండలకు ఈ షెల్టర్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా రాంబాబు చెప్పారు. ఈ కార్యక్రమమలో వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో స్వచ్ఛాంధ్ర

బుచ్చెయ్యపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వడ్డాది జూనియర్ కళాశాలలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మంచినీటి పథకాలకు క్లోరినేషన్ చేయించారు. పరిసరాల్లో చెత్తాచెదారాలను తొలగించారు. అలాగే కళాశాలలో తరగతి గదులను పరిశుభ్రం చేశారు. అనంతరం కళాశా ఆవరణలో మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతలను విద్యార్థులకు అప్పగించారు. ప్రిన్సిపాల్ జి.చిన్నారావు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్సీలో సత్తా చాటారు

రాష్ట్ర, జోన్, జిల్లా స్థాయిలో మెరుగైన ర్యాంకులతో ఉద్యోగాల సాధన

రెండు, మూడు కేటగిరీల్లో టాప్ ర్యాంకులు సాధించిన పలువురు అభ్యర్థులు

విశాఖపట్నం/అనకాపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి- న్యూస్ నెట్‌వర్క్): మెగా డీఎస్సీ ఫలితాల్లో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన పలువురు అభ్యర్థులు సత్తా చాటారు. రాష్ట్ర, జోన్, జిల్లా స్థాయిలో మెరుగైన ర్యాంకులు సాధించి ప్రతిభను కనబరిచారు. పలువురు అభ్యర్థులు రెండు, మూడు కేటగిరీల్లో టాప్ ర్యాంకులు సాధించి ఆయా కేటగిరీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిలో సాధారణ, నిరుపేద కుటుంబాలకు చెందిన ఎంతోమంది అభ్యర్థులు ఉన్నారు. ఆటో డ్రైవర్, రోజువారీ కూలీ పనులు చేసుకునే వారి కుమార్తెలు టాప్ ర్యాంకులను సాధించడంతో పాటు మూడు కేటగిరీల్లో ఉద్యోగాలకు ఎంపికై సత్తా చూపారు. కుటుంబ సభ్యుల సహకారం, స్పష్టమైన ప్రణాళికతోనే ఉద్యోగాలను సాధించినట్టు పలువురు అభ్యర్థులు పేర్కొన్నారు.

మద్యం దుకాణంలో సూపర్‌వైజర్.. నేడు వ్యాయామ ఉపాధ్యాయుడు

» తురువోలుకు చెందిన గుంపెన శివరామకృష్ణ



చోడవరం: వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఓ యువకుడికి నేడు కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయ ఉద్యోగం లభించింది. చీడికాడ మండలం తురువోలుకు చెందిన గుంపెన శివరామకృష్ణ డీఎస్సీ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫలితాల్లో ఉమ్మడి జిల్లా ఓపెన్‌లో 27వ ర్యాంకు సాధించాడు. ఈయన తండ్రి ఆర్టీసీ డ్రైవర్. రామకృష్ణ వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా పనిచేశారు. అయితే ప్రభుత్వ మద్యం దుకాణాలు తీసివేయడంతో ఇతని కొలువు పోయింది. కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో రామకృష్ణకు వ్యాయామ ఉపాధ్యాయ పోస్టు రావడం గమనార్హం. రామకృష్ణకు భార్య, ముగ్గురు పిల్లలు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేయాలన్న నా కల నెరవేరిందని రామకృష్ణ ఆనందం వ్యక్తం చేశారు.

గృహిణి పరమేశ్వరికి ఓపెన్‌లో జిల్లా స్థాయిలో 27వ ర్యాంకు

చోడవరం: పట్టణ శివారు అన్నవరం గ్రామానికి చెందిన పందిరి పరమేశ్వరి డీఎస్సీ సోషల్ అసిస్టెంట్ విభాగంలో ఉమ్మడి జిల్లా ఓపెన్ మహిళల కోటాలో 27వ ర్యాంకు సాధించి సత్తాచాటింది. పరమేశ్వరికి భర్త శ్రీనివాసరావు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో



భర్త ఇద్దరు పిల్లలతో గృహిణి పందిరి పరమేశ్వరి

కఠినంగా శ్రమించిన పరమేశ్వరి ఎట్టకేలకు తన కోరిక నెరవేర్చుకున్నారు. కష్టపడి చదివి విజయం సాధించడంపై స్థానికులు కుటుంబ సభ్యులు ఆమెను అభినందనలతో ముంచెత్తుతున్నారు.

పండ్ల వ్యాపారికి 42వ ర్యాంకు



నర్సీపట్నం: కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ సెకండరీ గ్రేడ్‌లో నర్సీపట్నానికి చెందిన విరోధి తరుణ్‌కుమార్ 42వ ర్యాంకు సాధించాడు. ఈయన ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే రోడ్డులో అతని సోదరుడుతో కలిసి పండ్లు వ్యాపారం చేస్తుంటాడు. ఈయన స్థానిక బీఆర్‌కాలేజీలో టీటీసీ పూర్తి చేశాడు. తండ్రి కాగితలరాజు పండ్ల వ్యాపారి, తల్లి లక్ష్మి గృహిణి. నిరుపేద కుటుంబానికి చెందిన తరుణ్ 42వ ర్యాంకు సాధించడంతో పలువురు అభినందిస్తున్నారు.

తల్లి కష్టానికి దక్కిన ఫలితం..



గొలుగొండ: డీఎస్సీ సెకండరీ గ్రేడ్‌లో మండలంలోని జోగంపేటకు చెందిన పసగొడుగుల సాయికుమార్‌కు జిల్లాలో 22వ ర్యాంకు సాధించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన సాయికుమార్‌కు తండ్రి చిన్నతనంలోనే మృతి చెందాడు. తల్లి రాజేశ్వరి రెక్కల కష్టంతో చదువుకుని 22వ ర్యాంకు సాధించాడు. దీంతో స్థానికులు సాయికుమార్‌కు అభినందనలు తెలిపారు.

పేదింటి విద్యా కుసుమం



దేవరాపల్లి: దేవరాపల్లికి చెందిన కాటపల్లి రవిశంకర్ ఉమ్మడి జిల్లాలో ఎస్‌జీటీ ఓపెన్ కేటగిరిలో 89.99 మార్కులతో 23వ ర్యాంకు సాధించాడు. ఈయన తల్లి మంగమ్మ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, తండ్రి అచ్చి బాబు భవన కార్మికుడిగా పనిచేస్తున్నాడు.

రాణించిన రైతు కుమార్తె



దేవరాపల్లి: మండలంలోని ఎం.అలమండలో సామాన్య రైతు కుటుంబానికి చెందిన కామిరెడ్డి రమణ, రాజులమ్మ కుమార్తె రాధ ఒకేసారి రెండు ఉద్యోగాలు సాధించింది. ఇటీవల ఆమె సిటీ సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయింది. తాజాగా ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో 86.09 మార్కులు సాధించి ఉమ్మడి జిల్లాలో ఎస్‌జీటీలో 69 ర్యాంకు సాధించింది.

శ్వేత సాధించింది..



దేవరాపల్లి: మండలంలోని మారేపల్లికి చెందిన సియాద్రి మంజీరా శ్వేత ఎస్సీ కేటగిరిలో హిందీ పోస్టుకు అర్హత పొందింది. ఈమె 66.78 మార్కులతో ఉమ్మడి విశాఖ జిల్లాలో 62వ ర్యాంకు సాధించింది. ఈమె తల్లి సన్యాసమ్మ అంగన్‌వాడీ కార్యకర్త కాగా, తండ్రి త్రినాథ రావు ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు.

- నాగయ్యపేటకు చెందిన కొడమంచిలి.శివ 86.63 మార్కులతో ఉమ్మడి జిల్లాలో 55 ర్యాంకు సాధించాడు. ఎస్‌జీటీలో ఉపాధ్యాయ కొలువు పొందాడు. తల్లిదండ్రులు కుల వృత్తి చేసుకొని జీవిస్తున్నారు.
- ఇదే గ్రామానికి చెందిన చుక్కా దుర్గారావు వ్యాయామ ఉపాధ్యాయుడుగా 85 మార్కులతో 13 ర్యాంకు సాధించాడు. వీరంతా ప్రభుత్వ కొలువుల్లో అర్హత సాధించారు. కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయ ఉద్యోగాలు వచ్చాయని వారంతా ఆనందం వ్యక్తం చేశారు.

భర్త సహకారంతోనే..

- కామిశెట్టి భాను పుష్ప, నాతయ్యపాలెం



నగరంలోని నాతయ్యపాలేనికి చెందిన కామిశెట్టి భాను పుష్ప డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ కేటగిరిలో 65.80 మార్కులు (139వ ర్యాంకు) సాధించారు. ఎంఏ (ఇంగ్లిష్) బీఈడీ చేసిన భాను ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. కోచింగ్ సెంటర్లకు వెళ్లకుండా ఇంటి వద్దే డీఎస్సీకి ప్రిపేరై భర్త రాజు సహకారంతో మొదటి విడతలోనే ఉద్యోగానికి ఎంపికవ్వడం ఎంతో ఆనందంగా ఉందని భాను తెలిపారు.

మెరిసిన లావణ్య



నక్కపల్లి: మండలంలోని గొడిచెర్ల గ్రామానికి చెందిన చెల్లపు లావణ్య ఎస్‌జీటీలో 91 శాతం మార్కులు సాధించి జిల్లాలో ఏడవ స్థానంలో నిలిచింది. వ్యవసాయ కుటుంబానికి చెందిన హనుమంతరావు, నాగమణి దంపతుల కుమార్తె లావణ్య గొడిచెర్ల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంది. డీఎస్సీలో సత్తా చాటిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీచర్ కావాలనే లక్ష్యంతో కష్టపడి చదివానని, మంచి ఫలితం రావడం ఆనందంగా ఉందన్నారు.

నానమ్మ, అమ్మమ్మల ప్రోత్సాహంతో..



నక్కపల్లి: మండలంలోని దోసలపాడు గ్రామానికి చెందిన భవిరిశెట్టి రామకృష్ణ ఎస్‌జీటీలో రెండవ ర్యాంకు సాధించారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులకు కోల్పోగా, నానమ్మ, అమ్మమ్మల ప్రోత్సాహంతో బీఈడీ వరకు చదువుకున్నాడు. డీఎస్సీలో సత్తా చాటడంతో అతనిని గ్రామస్థులు అభినందించారు.

శ్రమించాడు.. సాధించాడు



నక్కపల్లి: మండలంలోని గొడిచెర్ల గ్రామానికి చెందిన కర్రి రాజ నాగేశ్వరరావు ఎస్‌జీటీలో మూడవ ర్యాంకు సాధించాడు. తునిలో బైక్ సీటు కవర్ల తయారీ షాప్ పెట్టుకుని పనిచేసుకుంటూ ఖాళీ సమయంలో డీఎస్సీకి ప్రిపేర్ అయ్యేవాడు. 2015లో ఒకసారి అవకాశం కోల్పోయినా నిరాశపడకుండా శ్రమించాడు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉత్తమ ర్యాంకు సాధించాడు.

సెల్ పాయింట్ ఉద్యోగి శ్రీనుకు 38 ర్యాంకు



రోలుగుంట: మండలంలోని కొంతలం గ్రామానికి చెందిన తగరంపూడి శ్రీను డీఎస్సీలో మంచి ప్రతిభ కనబరిచాడు. గత 8 ఏళ్లగా నర్సీపట్నం సెల్‌పాయింట్‌లో పనిచేస్తూ మరోపక్క ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని పట్టుదలతో చదువుతూ డీఎస్సీలో సోషల్‌లో (స్కూల్ అసిస్టెంట్) 77 మార్కులు పొంది జిల్లా స్థాయిలో 38 ర్యాంకు సాధించాడు. ఈయన నిరుపేద కుటుంబానికి చెందినవాడు.

డీఎస్సీలో ముగ్గురు బైలపూడి యువకుల సత్తా



గెంజి రవి



గాడి అనిల్



ఆర్.త్రినాథ్

చీడికాడ: డీఎస్సీ ఫలితాల్లో ముగ్గురు బైలపూడి యువకులు మంచి ఫలితాలు సాధించారు. ఉమ్మడి విశాఖ జిల్లా సోషల్ సబ్జెక్టులో స్కూల్ అసిస్టెంట్ పోస్టుకి గెంజి రవికి మొదటి ర్యాంకు రాగా, దాడి అనిల్‌కి 15వ ర్యాంకు, ఆర్.త్రినాథ్‌కి 25వ ర్యాంకు వచ్చింది. వీరు ముగ్గురు గ్రామానికి ఆదర్శంగా నిలిచారని గ్రామపెద్దలు అభినందించారు. ముగ్గురూ వ్యవసాయ కుటుంబంలో జన్మించినవారే. అయితే భవిష్యత్తులో గ్రూప్1, గ్రూప్2 విభాగాల్లో స్థిరపడాలని లక్ష్యంగా పెట్టుకున్నామని రవి, అనిల్, త్రినాథ్ చెప్పారు.

ఒకేసారి మూడు పోస్టులకు ఎంపిక



ఉప్పు సంతోష్



బుగత కృష్ణకుమార్

పద్మనాభం: డీఎస్సీ ఫలితాల్లో పద్మనాభం మండల యువకులు ఒకేసారి మూడు పోస్టులకు ఎంపికయ్యారు. పొట్నూరు గ్రామానికి చెందిన ఉప్పు సంతోష్ గణితం స్కూల్ అసిస్టెంటు పోస్టులో 80.57 మార్కులతో 11వ ర్యాంకు పొందాడు, పీజీటీలో 69.8 మార్కులతో 46వ ర్యాంకు, ఎస్టీటీలో 80.07 మార్కులతో 272 ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు కుమార్, కళావతిలు కష్టపడి చదివించడంతో 2011లో బీఈడీ చేసి ఇన్నేళ్ల నిరీక్షణతో అనుకున్నది సాధించాడు. ప్రస్తుతం గోస్తనీ విద్యాపీఠ్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. అలాగే మద్ది గ్రామానికి చెందిన బుగత కృష్ణకుమార్ కూడా మూడు పోస్టులకు ఎంపికయ్యాడు. స్కూల్ అసిస్టెంటు ఫిజిక్స్‌లో 75.37 మార్కులతో 14వ ర్యాంకు పొందిన కృష్ణకుమార్ టీజీటీలో 65.12 మార్కులతో 54వ ర్యాంకు, పీజీటీలో 55 మార్కులతో 69వ ర్యాంకు పొందాడు. ఎంఎస్సీ, బీఈడీ పూర్తి చేసిన కుమార్ తల్లిదండ్రులు అప్పలనాయుడు, పైడితల్లి కూలి పనులు చేసుకుని చదివించారు.

240 కిలోల గంజాయి స్వాధీనం

» ఆరుగురి అరెస్టు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయిని రవాణా చేస్తున్న ఆరుగురిని శనివారం గూడ్స్‌షెడ్డు వద్ద అరెస్టు చేసి వారి నుంచి 240 కిలోల గంజాయి ని స్వాధీనం చేసుకున్నామని పట్టణ సీఐ టీవీ విజయకుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జి.మాడుగుల ప్రాంతానికి చెందిన సోమిలి బాలకృష్ణ, సోమిలి ప్రవీణ్‌కుమార్ వద్ద చీడికాడ మండలం బైలపూడికి చెందిన విస్సారపు లింగేశ్వరరావు మరో వ్యక్తి 240 కిలోల గంజాయి కొనుగోలు చేసి తమిళనాడుకు చెందిన వ్యాపారులకు అనకాపల్లిలో అప్పగించాలని నిర్ణయించారన్నారు. ఈ మేరకు షేక్ హుస్సేన్‌కు చెందిన కారులో గంజాయిని మూటలు కట్టి వేసి అనకాపల్లి రైల్వేస్టేషన్ వైపు వస్తుండగా మధ్యాహ్నం గూడ్స్‌షెడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ కె.సంతోశ్‌కుమార్, సిబ్బంది కలిసి గంజాయి రవాణా చేస్తున్న బైలపూడికి చెందిన విస్సారపు లింగేశ్వరరావు, జి.మాడుగులకు చెందిన సోమిలి బాలకృష్ణ, సోమిలి ప్రవీణ్‌కుమార్, బైలపూడికి చెందిన షేక్ హుసిన్, షేక్ హుస్సేన్, చేబోలు సంతోష్‌లను అరెస్టు చేశారన్నారు. కారును తనిఖీ చేయగా కారులో ఎనిమిది బ్యాగ్‌ల్లో 240 కిలోల గంజాయి బయటపడిందన్నారు. ఈ గంజాయిని, కారును, నిందితుల నుంచి రూ. 400లు నగదు, ఐదు మొబైల్ ఫోన్‌లను సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. నిందితులను కోర్టుకు తరలించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సంతోశ్‌కుమార్, వెంకటేశ్వరరావు, భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

20లోగా బీఎన్ రోడ్డు పనులు పూర్తి

... 3వ పేజీ తరువాయి

విజయరామరాజుపేట వద్ద వంతెనలతో పాటు మరికొన్ని వంతెనలు ఈ పనులలో చేపట్టలేమని కాంట్రాక్టర్ కోర్టుకు తెలిపారని అన్నారు. కరోనా కారణంగా ఆలస్యమైన పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఇచ్చిన గడువు వచ్చే ఏడాది మార్చి వరకూ ఉందని, అయితే ఈలోగానే బీఎన్ రోడ్డు అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించి నెల రోజుల్లోగా పూర్తి చేసి ఒక చక్కని రూపు ఇస్తామని కాంట్రాక్టర్‌తో పాటు ఆర్‌అండ్‌బీ అధికారులు అంగీకరించారని తెలిపారు.

కోర్టు ఆదేశాల మేరకు వారు లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చారని వివరించారు. ఈ సందర్భంగా రోడ్డు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ప్రజలకు ఇబ్బంది లేకుండా త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని జడ్జి.. ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచనలు చేశారని తెలిపారు.

గడువులోగా పనులు పూర్తి చేయకుంటే..

బీఎన్ రోడ్డు పనులను వచ్చే నెల 20వ తేదీలోగా పూర్తి చేస్తామని కాంట్రాక్టర్‌తో పాటు ఆర్‌అండ్‌బీ అధికారులు జడ్జి ఎదుట అంగీకరించారని చోడవరం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్ తెలిపారు. ఈ హామీ మేరకు పనులు చేపట్టకపోతే హైకోర్టుకు ప్రత్యేకంగా లేఖ రాస్తామని జిల్లా జడ్జి అధికారులకు, కాంట్రాక్టర్‌కు స్పష్టంగా ఆదేశించారని చెప్పారు. వారు అంగీకరించిన గడువులోగా ఈ రోడ్డు పనులు పూర్తి చేయకపోతే తామంతా జిల్లా కోర్టు ద్వారా హైకోర్టును ఆశ్రయించి ప్రత్యేక కేసు దాఖలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

వినాయక విగ్రహం వద్ద దుకాణాల ఏర్పాటుపై రగడ

» అనుమతి నిరాకరించిన దేవదాయ శాఖ

» అధికారులు, నిర్వాహకుల మధ్య వివాదం.. పోలీసుల జోక్యం



నిర్వాహకులకు, దేవాదాయ శాఖ అధికారుల మధ్య వాగ్వాదంతో రంగంలోకి వచ్చిన పోలీసులు



63 అడుగుల వినాయక విగ్రహం ఏర్పాటు చేస్తున్న దృశ్యం

చోడవరం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): చోడవరం స్వయంభూ వినాయకుని ఆలయం సమీపంలో ఏర్పాటు చేస్తున్న 63 అడుగుల భారీ విగ్రహం వద్ద దుకాణాల ఏర్పాటుకు దేవదాయ శాఖ అధికారులు నిరాకరించారు. దీంతో దేవదాయ శాఖ అధికారులకు, విగ్రహం నిర్వాహకులకు మధ్య వివాదానికి దారితీసింది. శనివారం దేవాదాయ శాఖ కార్యాలయం వద్ద అధికారులతో విగ్రహం నిర్వాహకులకు గొడవ జరగడంతో పోలీసులు జోక్యం చేసుకోవలసి వచ్చింది. చోడవరంలో సద్భావన ఫౌండేషన్ నిర్వాహకుడు 63 అడుగుల వినాయకుని విగ్రహం ఏర్పాటుకు శ్రీకారం చుట్టాడు. విగ్రహం ప్రాంగణంలో శనివారం నిర్వాహకులు వ్యాపారాలకు స్టాల్స్ ఏర్పాటు చేస్తుండడంతో, దేవాదాయ శాఖ ఈవో సత్యనారాయణ అనుమతులు లేవంటూ పనులను అడ్డుకున్నారు. దీంతో సద్భావన సంస్థ ఫౌండర్ రాజేష్ కొప్పాకకు, ఈవో సత్యనారాయణకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఎట్టి పరిస్థితుల్లో వాణిజ్య స్టాల్స్‌కు అనుమతించవలసిందేనని నిర్వహకులు పట్టుబట్టగా.. అనుమతులు తప్పని సరంటూ ఈవో వాదనకు దిగారు. దేవాదాయ శాఖ కార్యాలయం వద్ద ఉద్రిక్తత తలెత్తడంతో ఈవో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిర్వాహకులను పోలీస్ స్టేషన్‌కు రావాలని సూచించారు. ప్రస్తుతం నిర్వాహకులు దేవాదాయ శాఖ అధికారుల మధ్య చర్చలు జరుపుతున్నారు.



విగ్రహం సమీపంలో ఏర్పాటు చేస్తున్న దుకాణాల స్టాల్స్

విగ్రహం ప్రాంగణంలో వ్యాపారాలకు అనుమతి లేదు

దేవాదాయ శాఖ ప్రాంగణంలో వినాయకుని విగ్రహం ఏర్పాటుకు మా శాఖ ఉన్నతాధికారుల అనుమతి లేదు. అయినప్పటికీ వినాయక చవితి ఉత్సవాల దృష్ట్యా స్థానిక పెద్దల సూచనల మేరకు విగ్రహం ఏర్పాటును అడ్డుకోలేదు. ఇపుడు ప్రాంగణంలో దుకాణాలు, ఇతర స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఇటువంటి వ్యాపారాలు నిర్వహించడానికి అనుమతించేది లేదు. ఇదే విషయాన్ని నిర్వాహకులకు స్పష్టం చేశాం. కానీ వారు మా మాట వినడం లేదు. విగ్రహం వద్ద పూజలకు, ప్రజల దర్శనాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. అయితే వాణిజ్యపరమైన దుకాణాలకు మాత్రం అనుమతించేది లేదు. - సత్యనారాయణ, ఈవో, దేవాదాయ శాఖ

ఉద్యోగం..ఉత్సాహం

... 3వ పేజీ తరువాయి

సర్టిఫికెట్ల పరిశీలన చేస్తారు. సర్టిఫికెట్ల పరిశీలనలో పాల్గొనే ఎంఈవోలు, హెచ్‌ఎంలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శనివారం విశాఖ విమల విద్యాలయంలో శిక్షణ ఇచ్చారు. సర్టిఫికెట్ల పరిశీలన ఎప్పుడు జరిపేది ఆదివారం ప్రకటించనున్నారు. ఏ పోస్టుకు ప్రాధాన్యం ఇస్తున్నారో దరఖాస్తు చేసే సమయంలోనే అభ్యర్థులు ఆప్షన్ ఇచ్చారు. దీని ప్రకారం సదరు అభ్యర్థికి వచ్చిన మార్కుల ప్రాతిపదికగా పోస్టులో నియమిస్తారు. ఆ తరువాత ఆయా యాజమాన్యాలు ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇచ్చి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు పాఠశాల విద్యా శాఖ ఆర్జేడీ విజయభాస్కర్ తెలిపారు. కాగా ఉమ్మడి జిల్లాలో మెరిట్ జాబితా మేరకు ఏ ర్యాంకు వరకు పోస్టులు తీస్తారనే చర్చ అభ్యర్థుల్లో సాగుతుంది.


దీనిపై రకరకాలుగా అభ్యర్థులు, నిపుణులు లెక్కలు కడుతున్నారు. అయితే ఏ ర్యాంకు వరకూ ఉద్యోగం గ్యారంటీ అనేది స్పష్టంగా చెప్పలేమని, అది పోస్టులను బట్టి ఉంటుందని విద్యా శాఖకు చెందిన ఒక అధికారి తెలిపారు. ఉదాహరణకు స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కేటగిరీలో 139 పోస్టులు ఉన్నాయి. అందులో సగం రిజర్వేషన్ కు వెళతాయి. దీనిని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా కటాఫ్‌కు దగ్గరగా ఉన్న వారిలో మాత్రం కొంత ఉత్కంఠ ఉందని, బహుశా ఆదివారం లేదా సోమవారం పూర్తిగా స్పష్టత వస్తుందని అన్నారు.

అంగన్‌వాడీ భవనాలకు మోక్షమెన్నడో?

... 3వ పేజీ తరువాయి

చోట్ల అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి అవసరమైన స్థలాలు మంజూరు చేయకపోవడంతో సమస్య ఎదురవుతోంది.

ప్రభుత్వానికి నివేదిక పంపాం



జిల్లాలో అసంపూర్తిగా ఉన్న భవనాల నివేదికను ప్రభుత్వం కోరింది. మొత్తం 208 భవనాల నిర్మాణాలు సగంలో ఆగిపోయాయని నివేదించాం. 465 సొంత భవనాలకు మరమ్మతులు చేయించాలని ప్రతిపాదించాం. అద్దె భవనాల్లో ఉన్న 119 కేంద్రాలకు సొంత భవనాలు అవసరమని ప్రభుత్వానికి తెలియజేశాం. - ఎన్.సూర్యలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534